వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

62వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 62 ఫిబ్రవరి - మార్చి 2024 సంచిక - 9, 10










62వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 62 | ఫిబ్రవరి - మార్చి 2024 | సంచిక - 9, 10

**సంపాదకవర్గం :**
శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి. వర్ధని
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్. వి. సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**
శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్. అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి. రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై. శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి

## ఈ సంచికలో....

| | | | పేజిలలో |
|---|---|---|---|
| 1. | నా స్వగతం | - శ్రీ మల్లాది సూరిబాబు | 3 |
| 2. | 'కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసులు | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 7 |
| 3. | వాచామగోచరమే - కైకవశి | - శ్రీ ఆలమూరు విజయభాస్కర్ | 10 |
| 4. | BHARAT RATNA Bhimsen Joshi | - Cdr G. Sriramarao | 14 |
| 5. | వైద్య సంగీత విద్యా వైభవం | - ఐ. నాగ సుధా ప్రణవ | 17 |
| 6. | 'హరికధక రాజహంస' , 'కళాప్రపూర్ణ' డా. అమ్ముల విశ్వనాధ భాగవతార్ | - యనమండ్ర వెంకట కృష్ణయ్య | 22 |
| 7. | సంగీత సభల కార్యకలాపములు | - 'విహారి' | 28 |

## ముఖచిత్రం

1. నేలకొండపల్లిలో పూజలందుకొన్న భక్తరామదాసు.
2. రాష్ట్రపతి గౌరవనీయ శ్రీమతి ద్రౌపదీ ముర్ము గారి నుండి సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న సంగీత విద్వన్మణి శ్రీమతి మండా (ఆలమూరు) సుధారాణి.
3. శాస్త్ర యూనివర్శిటి-చెన్నై ఆధ్వర్యంలో 26.1.2024 న సంగీత వాచస్పతి బిరుదు పొందిన విద్వాన్ శ్రీ మల్లాది సూరిబాబు. యూనివర్శిటీ ఛాన్సలర్ శ్రీ వైద్య సుబ్రహ్మణ్యన్, డైరెక్టర్ శ్రీమతి సుధాశేషయ్యన్ లతో..
4. ప్రముఖ వీణా విద్వాంసురాలు, సద్గురువు విదుషి శ్రీమతి బి. ఆనందరాజ్యలక్ష్మిగారికి హైదరాబాదులో జరిగిన గురువందన కార్యక్రమం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

# నా స్వగతం



మల్లాది సూరిబాబు

(గత సంచిక తరువాయి భాగం)

1970 జూన్ లో విజయవాడ రేడియో కేంద్రంలో ప్రోగ్రాం ఎనౌన్సర్ గా చేరాను. వివిధ భారతి కార్యక్రమాలు కొత్తగా అటు హైద్రాబాద్ నుండీ, యిటు విజయవాడ కేంద్రాలనుండి ఒకేసారి ప్రారంభమయ్యాయి.

ఉదయం 6 గం.ల నుండీ రాత్రి 11 గం.ల వరకూ అరగంట చొప్పున, ఎన్నో వైవిధ్య భరితమైన పాటలతో, ప్రతి కార్యక్రమం పసందుగా రూపొందించబడేది.

హిందీ చిత్ర గీతాలే ఎక్కువగా ఉంటూ, తెలుగు, తమిళ, మళయాళ భాషల్లో కూడా ఎన్నో పాటలు ప్రసారమౌతూ శ్రోతలను ఆకర్షిస్తూనే సాగేవి.

వృత్తిరీత్యా ఎనౌన్సర్నే అయినా ప్రవృత్తి ‘సంగీతం కావటంతో, నేను చేసేది ఉద్యోగంలా భావించలేదు. అదృష్టంగా భావిస్తూ పాట దోరణిలోనే టైం గడిచిపోయేది.

మా తండ్రిగారి వల్ల సంక్రమించిన సంగీత జ్ఞానమే రేడియోలో పనిచేసే అవకాశాన్ని కల్పించింది. పాడినది ‘చిలక పలుకుల్లా’ నాన్నగారికి ఒప్పగించడమే తప్ప, ప్రాథమిక స్థాయిలో నేర్చుకోవలసినవేమీ నేర్చుకోలేదు. అలంకారాలు, స్వరజతులు, వర్ణాలు జోలికి వెళ్ళలేదు.

రాగం, రాగస్వరూపం, సంచారాలు, గమక సౌందర్యం, వంటి విషయాలు లోతుగా అధ్యయనం చేయటం కూడా ఉండేది కాదు.

వాటి అవసరమూ కలగలేదు. రేడియోలో వివిధ విద్వాంసుల గానం, నిలయ విద్వాంసులతో ఏర్పడిన అనుబంధం సంగీతాసక్తిని మరింత వృద్ధి చేసింది.

వోలేటి గారితో ఏర్పడిన మైత్రి నాకు వరమైంది. కర్ణాటక సంగీతంపై మక్కువ ఏర్పడింది. పూర్తిస్థాయిలో ఒక మంచి అవగాహనతో పాడటం మొదలైంది.

నేనెరగని అపురూపమైన ఎన్నో కీర్తనలు నేర్చుకోవడమే ఒక పెద్ద మలుపు.

నా సంగీత యాత్రలో అదో శుభపరిణామం. ఏం పాడుతున్నాం? ఎలా పాడుతున్నాం? అనే ఆత్మవిమర్శకు ‘సంగీతశిక్షణ’ కార్యక్రమం దారి చూపింది. నిర్దిష్టమైన కాలప్రమాణంతో కీర్తలనచుట్టూ ఏర్పడిన ‘స్వరసముదాయంతో పాడే గమకాలు, వాటి స్వరూపం’ అర్థంచేసుకునే అవకాశం అలవోకగా తెలుసుకునే మార్గం దొరికింది.

తాళంతో పాడితే కీర్తన. లేకపోతే కీర్తనలో

కనిపించేదంతా రాగమే.

సంగీతత్రిమూర్తులు రచనలలో శ్రేష్టమైనవి వోలేటి గారెదురుగా కూర్చుని నేర్చుకునే అవకాశం, అదృష్టం నాకే దక్కింది.

నాకు తెలిసి, 1955 నుండీ విజయవాడ రేడియో కేంద్రం నుండి ప్రసారమయ్యే సంగీత శిక్షణలో బోధించే కీర్తనలు, మనవారికంటే యితర రాష్ట్రాల్లోనుండే ఔత్సాహికులైన సంగీత విద్యార్థులు ఆ రోజుల్లో శ్రద్ధగా విని నేర్చుకునేవారు.

రేడియో కార్యక్రమాల విశేషాలతో వెలువడే వాణి పత్రికలో కీర్తన పాఠం స్వరంతో ఉండేది.

నాకు తెలిసిన చాలామంది విద్వాంసులు, విద్యార్థులు ఈ సంగీత శిక్షణ పాఠాలను జాగ్రత్తగా పదిలపరుచుకోవడం ఎఱుగుదును.

ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడులోని ఔత్సాహికులైన విద్యార్థులు, విద్వాంసులు ఈ సంగీత శిక్షణ కార్యక్రమాల ప్రసారాన్ని యథాతథంగా క్యాసెట్లలో భద్రపరుచుకుని వింటూ నేర్చుకున్నారు.

వోలేటి గారు బాగా యిష్టపడి, శ్రద్ధగా నిర్వహించిన అనేక సంగీత కార్యక్రమాలన్నీ ఒక ఎత్తైతే సంగీత శిక్షణ మరో ఎత్తు. ఆయన ప్రాణమంతా ఆ కార్యక్రమంపైనే ఉండేది.

విజయవాడ కేంద్రంలో ప్రొడ్యూసర్ గా చేస్తూ అనుకూలంగా లేని అధికారుల ఒత్తిళ్ళు పడలేక 1987 లో స్వచ్ఛందగానే పదవీ విరమణ చేసి, కొన్నాళ్ళకు వోలేటిగారు విజయవాడలో కట్టుకున్న గృహాన్ని అమ్మేసుకుని హైద్రాబాద్ వెళ్ళిపోయారు. ఇది నేను ఊహించలేదు. రిటైరైన తర్వాత ఆయనతో, మరింత సన్నిహితంగా మెలుగుతూ, పాడుకోవచ్చునని అనుకున్న నేను, నిరాశపడ్డాను.

ఓలేటి గురువుగారితో నాకున్న అనుబంధం రెండున్నర దశాబ్దాల పాటు సాగింది బెజవాడలో. సంగీత శిక్షణలో భయభక్తులతో నేను కీర్తనలు నేర్చుకోవడం, నేర్చుకున్నవి పాడడుతూ వుండడం, ఆయనకు పాడి వినిపించడంలో ఆయనకు నాపట్ల అమితమైన వాత్సల్యం ఏర్పడింది. బెజవాడలో ఇల్లు కట్టుకున్నా, ఏదో కారణాంతరాలవల్ల దానిని అమ్మేద్దామనుకున్నారు ఆ దంపతులు. హైదరాబాదులో వున్న బావమరిది ‘‘ఇక్కడకు వచ్చేయండి, మేమున్నాము కదా! అన్నీ చూసుకుంటాం’’ అని భరోసా ఇచ్చారు. నా ఆర్థిక స్థాయి సరిపోక ఆ ఇల్లు నేను కొనుక్కుందామనుకున్నా కొనుక్కోలేకపోయాను. 1987 ఆ ప్రాంతాలలో విజయవాడలో ఇల్లు అమ్మేసి హైదరాబాదు మకాం మారుస్తున్న తరుణంలో వారింటికి వెళ్ళి, పాదనమస్కారం చేసి, నిలబడ్డాను. నా దుఃఖాన్ని గమనించిన ఓలేటివారు అనునయిస్తూ, ‘‘దుఃఖపడకండి, నేను చెప్పిన కీర్తనలు పాఠం చేస్తూ ఉండండి. ఏ అవసరం వచ్చినా హైదరాబాదు వచ్చేయండి’’ అని భరోసా ఇచ్చారు. యం.వి. రమణమూర్తి, పెమ్మరాజు సూర్యారావు, శ్రీరంగం గోపాలరత్నం, వసుంధరా దేవి (విశాఖ) నా దగ్గర నేర్చుకున్నారు. మీలో ఒకరకమైన స్పార్క్ వుంది. కీర్తనలు నేర్చుకోవాలనే శ్రద్ధ కూడా వుంది. కాబట్టి, బాగా పాఠం చేసి నేర్చుకోమని

ఆశీర్వదించ వెళ్ళిపోయారు. నా జీవితంలో ఒక వెలితి, ఒక దిగులు అనుక్షణం వెంటాడుతూ వుండేవి. గురువుగారు దగ్గర లేరన్న బాధ వేధిస్తూ వుండేది. చాలా కాలం దాకా ఆ ఇబ్బంది నుండి తేరుకోలేకపోయాను.

ఆ తర్వాత విశాఖ నివాసి బ్రహ్మశ్రీ పొదిలి బ్రహ్మయ్యశాస్త్రిగారి ద్వారా శ్రీపినాకపాణిగారితో పరిచయం ఏర్పడింది. పాణి గారిని కలుద్దామని వారి మిత్రులైన బ్రహ్మయ్యశాస్త్రిగారితో చెప్పగానే వారు మొదటగా పాణిగారి రికార్డింగ్స్ పంపించారు వినమని. వాటిలో కొన్ని కచేరీలవి, కొన్ని విడి రికార్డింగ్స్.

3, 4 క్షేత్రయ్య పదాలు కూడా అందులో ఉన్నాయి. అందులో పున్నాగవరాళిలోని పదం నన్ను బలంగా ఆకట్టుకుంది. ఎప్పటికైనా ఈ పదాన్ని నేర్చుకుని వారికి పాడి వినిపించి మెప్పు పొందగలనా అనిపించింది. తక్షణం పాణిగారికి "అయ్యా! నాపేరు సూరిబాబు, నేనిలా మీ వద్దకు వద్దామనుకుంటున్నాను. ఏమంటారు?" అని, ఉత్తరం రాసాను. బదులుగా వారినుండి ఓ పోస్ట్ కార్డు అందింది. "సూరిబాబుగారూ! నా వయస్సిప్పుడు 87. శారీరకంగా అస్వస్థుడనే. లేచి కూర్చోలేను. కానీ, నా పాటకు, నామనసుకు ఆ వయోభారం అంటలేదు. నేర్పేందుకు సంసిద్ధుడనే" అని. అంతే, వెంటనే కర్నూలు వెళ్ళిపోయాను. ఇది 89-90 మధ్యకాలపు సంగతి. ఇలా పదాలు నేర్చుకోవడానికి, కొన్ని కీర్తనలు పాఠం చేయడానికి వారితో మొదలైన అనుబంధం ఒక దశాబ్దం పాటు సాగింది.

పాణిగారి దగ్గర పాఠం చెప్పుకునే రోజులో ధర్మపురి రామ్మూర్తి గారినే విద్వాంసునితో పరిచయం అయింది. వారిద్దరి కుమార్తెలకూ పాణిగారి దగ్గర సంగీతం నేర్పించడానికి కర్నూలు మఖాం మార్చారు. రామ్మూర్తిగారి భార్య కూడా వీణ నేర్చుకునే వారు. రామ్మూర్తి గారు సంగీత పాఠాలు చెప్పుకుంటూ, కచేరీలు చేస్తూ జీవనం గడిపేవారు కర్నూలులో. నేను పాఠానికి వెళ్ళగానే వారిని కూడా రమ్మని కబురంపేవారు. అలా వారితో మంచి స్నేహం ఏర్పడింది. పాణగారితో సంగీత కాలక్షేపం మాకెంతగానో ఉపయోగపడింది. నాకూ, నా పిల్లలకూ. స్వరానికీ సాహిత్యానికీ మధ్య వున్న అనుబంధం బాగా అవగతమైంది. స్వరాన్ని ఎలా చూడాలి? చూసిన స్వరాన్ని ఎలా అన్వయం చేసుకోవాలి? రాగభావం వచ్చేలా ఎలా పాడాలి? రాగ భావం వచ్చే సంగతులతో సాహిత్యాన్ని ఎలా కలుపుకుంటూ పాడాలి? ఇవన్నీ పాణిగారి దగ్గర కూర్చుని పాడుతుంటే మరింత అర్థమయ్యేవి. అంతకుముందు ఓలేటిగారితో నేను పాడుతున్నప్పుడు ఎక్కడా తేడా లేకుండా, ఆయనకు ఇబ్బంది కల్గించకుండా పాడాలి అనే దృక్పథంతో పాడేవాడిని ప్రత్యక్ష ప్రసారం కాబట్టి. అలా నేర్చుకున్నది కాస్తా మనసుకు పట్టేది. పాణిగారి దగ్గరకి వచ్చిన తర్వాత ఈ స్వరం, స్వరాన్ని సంక్షిప్తం చేసుకుని పాడడం, సంక్షిప్తం చేసుకుని పాడుతున్నప్పుడు కలిగే రాగభావం, రాగభావం వచ్చిన తర్వాత సాహిత్యాన్ని ఆ రాగ భావంతో ఎలా పలకడం... ఇవన్నీ చెప్పకనే చెప్పేసేవారాయన. ఫలానా కీర్తన వచ్చా అని అడిగితే స్విచ్ వేస్తే,

లైటు వెలిగినట్టు ఆయన నోటినుంచి ఆ కీర్తన వచ్చేసేది. కొన్ని వందల కీర్తనలు అలా పాడి వినిపించారు. నా జీవితంలో వారి పరిచయం మరో మలుపు. అలా క్షేత్రయ్య పదాలు, కొన్ని అపురూపమైన జావళీలు, కొన్ని సంగీత త్రిమూర్తుల కీర్తనలు ఉన్నాయి. కొన్ని కీర్తనలైతే అంతకు ముందు మేము విని ఉండలేదు. బలహంసలో 'తల్లిదండ్రులు గల పేరుగాని' అనే కీర్తన, 'విరాజరాజ తురగ' 'ఇక కావలసినది', 'లంబోదర మవలంబే' అనే మైసూరు వాసుదేవాచార్య కీర్తన వంటి కీర్తనలు ఆయనవల్ల తెలిసాయి.

సంగీత గురువులు రెండు రకాలుగా వుంటారు. ఒకరు ప్రాథమికంగా సరళిస్వరాలు, వర్ణాలు, తదితరమైన ప్రాథమికాంశాలను నేర్పేవారు. మరొకరు విద్వాంసుల కోవకు చెందినవారు. వారు సంగీత కచేరీలో ఎలా పాడతారో అలా పాఠం నేర్పగలిగేవారు. వారు బోధకులు, అధ్యాపకులు అనిపించుకుంటారు. ఈ కోవకు చెందిన ఓలేటి వారితో, పినాక పాణిగారితో, నేదునూరి వారితో మాకు గల అనుబంధం నాకూ, నా పిల్లలకూ సంగీత పరమైన అవగాహన ఎక్కువ అవడానికి దోహదం చేసింది. ముగ్గురూ సాధకులే, అందులో సందేహం లేదు. పినాకపాణిగారు మూల విరాట్టు అనుకుంటే, ఓలేటివారు, నేదునూరి వారు ఉత్సవమూర్తుల వంటివారు. మూలవిరాట్టువంటి గురువుల దగ్గర నేర్చుకున్న సంగీతాన్ని వారికి తగినట్లుగా అన్వయం చేసుకుని చక్కగా పాడి వినిపించిన మహా విద్వాంసులు ఓలేటి, నేదునూరి గారలు.

నా పిల్లలకు నేదునూరి వారు గురువుగా దొరకడమే ఒక అదృష్టంగా చెప్తాను నేను. అది ఒక సుకృతం. నేనూ నేర్చుకున్నాను ఓలేటివారి వద్ద. నాదగ్గరా అపురూపమైన కీర్తన పాఠం వుంది. నా పిల్లలకు అవి నేర్పేను. కానీ, తండ్రి అనే భావం తప్పితే, గురువు అనే భావం పిల్లలకు లేకపోవచ్చు. పుట్టక పోవచ్చు. ఆ భయంకొద్దీ కృష్ణమూర్తి గారి వద్ద వున్న చనువుతో 'అయ్యా! నా పిల్లలని మీ దగ్గరకు పంపిస్తాను' అని అడిగాను. నా అదృష్టమో, పిల్లల అదృష్టమో, భగవంతుని కటాక్షమో తెలియదుగానీ, తప్పకుండా పంపించమన్నారు. ఇక్కడ విజయవాడ సంగీత కళాశాలనుండి పదవీ విరమణ చేసి విశాఖ వెళ్ళిపోతుంటే, 'మా పిల్లలని ఎప్పుడు పంపించను?' అని అడిగాను. అదే సమయంలో సెంట్రల్ గవర్నమెంటువారి స్కాలర్ షిప్ కు పిల్లలను దరఖాస్తు చేయమని సూచించింది కూడా నేదునూరి కృష్ణమూర్తిగారే! అది మా పిల్లలకు లభించడంతో, అప్పటికే డిగ్రీ పూర్తిచేసిన నా పిల్లలని విశాఖపట్నం పంపేను. అది వారి జీవితంలో గొప్ప మలుపు. ఓలోటి, నేదునూరి వారలనుంచి వచ్చిన సంగీతం ఒకలా పాణిగారి నుంచి వచ్చిన సంగీతమే! గమకాలలో గానీ, పడికట్టులలో గానీ, రాగభావం వచ్చేలా పాడడంలోగానీ మా ముగ్గురి మధ్యా తేడాలేదు. కృష్ణమూర్తి గారి పాఠం ఒకలా వుండేది. ఓలేటి గారి పాఠం ఒకలా వుండేది. ఇద్దరిదీ పాణిగారి వద్ద పొందిన పాఠాంతరమే! ఇలా చాన్నాళ్లు గడుస్తూ వచ్చింది.

(ఇంకా ఉంది)

★ ★ ★

సుధాతరంగము

# 'కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసులు



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ

క. **దురిత వ్రాతములెల్లను పరిమార్చెడి**
**హరిగుణముల పాడుచునెపుడున్**
**బరవశుడై వెలయు పురం**
**దరదాసుని మహిమలను దలచెద మదిలోన్**

త్యాగయ్యగారు తాను వ్రాసిన 'ప్రహ్లాద భక్తి విజయం' గేయ ప్రబంధంలో, 'కర్ణాటక సంగీత పితామహుని' గా కీర్తించబడిన పురందరదాసులవారిని పైవిధంగా ప్రస్తుతించారు.

అన్నమయ్యకు సమకాలికుడు పురందరదాసు. కోటీశ్వరుడైన వరదప్పనాయకుడి కడుపున కన్నడదేశంలో, పురందరఘడ్ గ్రామంలో పుట్టారు. ఏడుకొండలవాని అనుగ్రహంచేత కల్గిన తన కుమారునికి 'శ్రీనివాసనాయకుడని' పేరుపెట్టారు వరదప్ప. వాడుకలో, అతనిని అందరూ 'శీనప్ప' అని పిలిచేవారు.

సంగీత,సాహిత్యాది విద్యలను,ఉద్దండులైన గురువులవద్ద నేర్చినా, పదహారేళ్లకే తండ్రినుండి సంక్రమించిన రత్నాల వ్యాపారంలో కాకలుతీరారు శీనప్ప.పరమలోభిగా జీవనం గడుపుతున్న శీనప్పకు, పరమసాధ్వి అయిన సరస్వతీబాయితో వివాహమైంది.

అదే ఆతని జీవనగమనాన్ని మార్చింది. భగవంతుడు కొన్ని కార్యాల కోసం, కొంతమందిని ఎంచుకుంటాడు... కర్ణాటక సంగీతాన్ని, భక్తి మార్గాన్ని ప్రబోధించేందుకు శీనప్పను ఎంచుకున్నాడు.

ఒకరోజు ఉదయం శీనప్ప దుకాణానికి ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చి, తన కుమారుని ఉపనయనం కోసం ధనమిమ్మని యాచించాడు.'రేపు, మాపని' తిప్పుతూ కాలయాపన చేస్తున్న శీనప్పతో విసిగి, ఆ బ్రాహ్మణుడు నేరుగా శీనప్ప ఇంటికి వెళ్లి, సరస్వతీబాయిని అర్థించాడు.

ఆ సమయంలో, చేతిలో పైకం లేకపోవడంతో, తన బంగరు ముక్కెరను తీసి, దానంచేసింది ఆ దయామయి. బ్రాహ్మణుడు తిరిగి ఆ దుకాణానికే చేరుకొని, ముక్కెరను శీనప్పకు అమ్మజూపాడు.

దానిని చూడగనే, అది తన భార్యదని గ్రహించిన శీనప్ప, 'ముక్కెర తెమ్మని' ఇంటికి, పనివానితో కబురుచేశారు. ''తాను ముక్కెరను దానంచేసిన విషయం తన భర్తకు తెలిసిపోయిందనే' భయంతో, తనకిక మరణమే శరణ్యమని నిశ్చయించుకొన్న సరస్వతీబాయి, విషము త్రాగబోగా, ఆ విషపాత్రలో ఆమెకు ముక్కెర కనబడింది. దుకాణానికి దానిని పంపింది ఆమె.

శీనప్ప రెండు ముక్కెరలూ సరిచూసుకొని, ఆశ్చర్యంతో ఇంటికి వచ్చి, భార్య ద్వారా జరిగిన

విషయం తెలుసుకున్నారు. వృద్ధ బ్రాహణుడు అదృశ్యమయ్యాడు....' ఇది అంతా, తనలో పరివర్తన తెచ్చేందుకు శ్రీహరి చేసిన మాయ' అని తెలుసుకున్నాడు శీనప్ప.

ఆ క్షణమే ఒక నిర్ణయానికొచ్చారు.తన యావదాస్థినీ పేదలకు దానమిచ్చి, తంబుర చేతబూని, హరినామస్మరణం చేస్తూ... ఇలా పాడుకొన్నారు...

**'యౌవనదల్లి శ్రీహరిపాదనంబదే**
**మూవత్తువరుష మోహాబ్ధియల్లి బిద్దె'...**

'శ్రీహరి పాదము గానక, ముప్పది యేండ్లు మోహ సంద్రములో మునిగి మోసబోతినే!' అని విచారించి, హరిపాద సమర్పణగా కీర్తనలు ఆసువుగా పాడటం ఆరంభించారు.

వ్యాసరాయస్వామి,మధ్వ మఠాధిపతి అయిన సత్యధర్మ తీర్థుల ద్వారా మంత్రోపదేశం పొంది, 'పురందరదాసు' గా గణుతికెక్కారు శీనప్ప.

'పురందర విఠల' ముద్రతో, దాసర పదగళు, దేవరనామాలు అని పిలువబడే ఆ కీర్తనలు, తన జీవితకాలంలో పురందరదాసులవారు, 4,75,000 కు పైగా పాడుకొన్నట్లు,వారి 'వాసుదేవ నామావళియ' అనే ముఖారి రాగ కీర్తన వల్ల తెలుస్తోంది.

**ఇది నిజంగా ఒక ప్రపంచ వింతే!**

అంతేకాక, పురందరదాసు 'కర్ణాటక సంగీత పితామహునిగా' కైమోడ్పులందుకోవడనికి కారణం..

ఒక సంగీత విద్యార్థి, ఏ విధంగా అంచెలంచెలుగా సంగీత శిక్షణ పొంది, సాధన చేయాలో నిర్దేశించారాయన. సరళీవరసలతో ప్రారంభించి, వరుసగా... జంటస్వరాలు, అలంకారాలు, పిళ్లారి గీతాలు,వర్ణాలు....ఆ పిదప కీర్తనలు... ఈ విధంగా విద్యార్థికి ఒక పాఠ్య ప్రణాళికను ఏర్పరచిన మహనీయుడు పురందరదాసు.

సరళతరమైన మాతృ(కన్నడ)భాషలోని వీరి రచనలు, ఆబాలగోపాలాన్నీ ఆనందసాగరంలో మునకలేయిస్తాయి.

1484-1564 మధ్య కాలంలో జీవించిన పురందరదాసు, అన్నమయ్యను తిరుమలపై కలసినట్లు, వారిరువురూ కొన్ని సంకీర్తనలను కలసి పాడుకొన్నట్లు... చరిత్ర చెప్తోంది.

1564 జనవరి 2వ తేదీన, రక్తాక్షినామ సంవత్సర పుష్య బహుళ అమావాశ్య తిథిరోజు వేంకటేశ్వరునిలో ఐక్యమైన ఆ మహనీయుడు, ప్రతి సంగీత కళారాధకుడికీ ప్రాతః స్మరణీయుడు.

భక్తితో తనువు మరచి, గానం చేస్తే, భగవంతుడు దర్శనమిస్తాడు. ఆ గానం విన్న జనులూ తరిస్తారు. అందులోనూ కలియుగ ప్రత్యక్షదైవమైన ఏడుకొండలస్వామి ఎంత సంగీత ప్రియుడంటే..

అవి.. నేను కడప ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తున్న రోజులు(1996).అప్పటికి నాకు సంగీత నిర్దేశకుడిగా అక్కడ ఉద్యోగం వచ్చి రెండు సంవత్సరాలైంది. బెజవాడలో అదే ఉద్యోగం ఖాళీ అయినట్లు తెలిసింది.బెజవాడ నా స్వస్థలం కాబట్టి అక్కడికి నా ఉద్యోగం బదిలీ చేయించుకోనే ప్రయత్నంలో ఒక ముఖ్యమైన వ్యక్తిని కలిసేందుకు తిరుపతి వచ్చాను.అయితే నేను వచ్చిన పని ఆరోజు పూర్తి కాలేదు.

మరునాటిదాకా ఉండవలసివచ్చింది.ఎందుకో నాకు ఆలోచన వచ్చింది. కొండమీదికెళ్లి స్వామి దర్శనం చేసుకోగలిగితే బాగుంటుందని. కాని ఆ రోజు రద్దీ మరీ ఎక్కువగా ఉందని తెలిసింది. అయినా అనుకున్న తర్వాత వెళ్లవలసిందేననుకొని, వెంటనే బయలుదేరాను.

తిరుమలపై విపరీతమైన జనసందోహం.. మధ్యాహ్న సమయం.. సరాసరి దర్శనం క్యూలోకి వెళ్లి,నిలబడ్డాను. భోజనం చేయకపోవడంతో ఆకలి తీవ్రమౌతోంది. నా దృష్టి అంతా దర్శనంమీదే ఉంది. ప్రత్యేక దర్శనం క్యూలో ఉన్నా, సుమారు 4 గంటలు పట్టింది బంగారు వాకిలి సమీపించడానికి.

జనం తోసుకుంటున్నారు.. నా ప్రమేయం లేకుండానే ముందుకి వెళుతున్నాను. అన్నిచోట్లా నన్ను ఇబ్బందిపెట్టే నా ఆరడుగుల పొడగరితనం, దైవదర్శనానికి మాత్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఎందుకంటే గర్భగుడిలో మలుపుతిరగగానే అందరికన్నా ముందుగా ఎప్పుడూ నాకే స్వామి దర్శనభాగ్యం కల్గుతుంది. నడుస్తూకూడా అందరికన్నా పైనుండి దేవుని దర్శించుకోగలుగుతాను. ఆరోజూ అదే జరిగింది.

చూస్తూండగానే స్వామికి దగ్గరగా వచ్చేశాను. స్వామి విరాట్ స్వరూపం కళ్లముందు మెరిసిపోతోంది. క్షణం గడవకుండానే అక్కడి వాలంటీర్లు నాముందు వ్యక్తిని రెక్క పట్టుకొని పక్కకిలాగేశారు. ఇక ఇప్పుడు నావంతు.. 'అయ్యో! ఇంత కష్టపడి వస్తే కాసేపయినా దర్శనమీయవా!స్వామీ!' అనుకునేంతలో నా నోటినుండి అప్రయత్నంగా... 'వెంకటాచలనిలయం.. వైకుంఠపురవాసం' అనే పురందరదాసు కీర్తన హెచ్చు శ్రుతిలో వెలువడింది. తదేకంగా స్వామిని చూస్తూ ఎవరినీ పట్టించుకోకుండా బిగ్గరగా పాడుతునే ఉన్నాను. ఆలయమంతా నిశబ్దం ఆవరించింది. కదులుతున్న జనం ఆగిపోయారు.వాలంటీర్లు ఒక్క క్షణం అచేతనంగా ఉండిపోయారు. పల్లవి... అనుపల్లవి.. చరణం.. ఇలా కీర్తన మొత్తం అన్ని సంగతులతో పూర్తిచేశాను. అయిదు నిమిషాలు గడిచిపోయాయి..ఆశ్చర్యం! వాలంటీర్లు తమను తాము మరచిపోయి, అంతసేపూ నాపాట విన్నారు!

పాట ముగిసింది. నాదలోలుడై, అంతసేపు నాకు దర్శనమిచ్చిన స్వామికి తృప్తిగా నమస్కరించి, వెనుతిరిగాను.

బయటికి రాగానే నావెనుక నుండి ఎవరో బెంగాలీ అతను వచ్చి, నాకు దండంపెట్టి, వచ్చీరాని హిందీలో, 'బాబూ!ఎంతో దూరం నుండి సకుటుంబంగా వచ్చాను. మీరు ఈరోజు రావటం మా అదృష్టం. మీరు పాడటంచేత, మీవెనుక నిలబడిఉన్న మేమూ ఎక్కువసేపు భగవాన్ దర్శనం చేకోగలిగాం. మిమ్మల్ని మేం ఎన్నడూ మర్చిపోలేం.. ధన్యవాదాలు'.. అన్నాడు.

'ఆహా! నా సంగీతం ఎంత గొప్పది?' అనుకున్నాను.

ఆనాడు మనసులో స్వామిని నేను కోరుకొన్నట్లే, మరొక నెల రోజుల్లో నాకు కడప నుండి బెజవాడకు బదిలీ ఆదేశాలు ఢిల్లీ నుంచి వచ్చాయి.

# వాచామగోచరమే - కైకవశి



- ఆలమూరు విజయభాస్కర్

ప. వాచామగోచరమే మనసా వర్ణింపతరమే రామమహిమ

అ. రేచారి మారీచుని పడగకొట్టి రెండోవాని శిఖికొసగెనే (వా)

చ. మానవతీ మదినెరిగి చామరమౌటకస్త్రమునేయ కని
మానంబుకై మెడ చాచగా మాధవుండు కని కరగి వేగమే
దీనార్తిభంజనుడై ప్రాణదానంబొసగ మునుచనిన
బాణంబునటు చెదరజేయ లేదా గానలోల త్యాగరాజనుతుమహిమ (వా)

**ఉపోద్ఘాతము:**

త్యాగరాజస్వామి శ్రీరామమహిమను అనేక కృతులలో అద్భుతంగా వివరించారు. అట్లు వర్ణించిన కృతులలో తలమానికమైన దానిగా ఈ "వాచామగోచరమే" కృతిని నేను భావిస్తాను. ఈ కృతిలో ఆయన తన కష్టాలను తీర్చమని వేడుకోరు. తన కర్మఫలాన్ని అనుసరించి, రాముడు తనకు ప్రసాదించే సుఖదుఃఖాలను వైక్లబ్యరహితుడై స్వీకరించే, మానసిక పరిపక్వస్థితిని చేరుకున్న త్యాగరాజస్వామి దర్శనమిస్తారు. ఈ కృతిలో రామునికి సంపూర్ణశరణాగతి చేసిన త్యాగరాజస్వామి మనకు దర్శనమిస్తారు.

అంతేకాదు ఈ దశలో ఆయన సంగీతసాహిత్య ప్రౌడిమను త్యజించి, అతిసరళమైన సాహిత్యంతో, భావభరితమైన సంగీతంతో రాముని కీర్తిస్తారు. ఎందుకంటే ఈ సంగీతసాహిత్యప్రౌఢిమలో అంతర్లీనంగా అహంకారం ఉంటుంది. దానిని విసర్జించినపుడే వారి హృదయంలోని భక్తియనే దీపము వారికృతిలోని అల్పాక్షరపదములనుకూడా మహిమాన్వితమైన భావతేజంతో ప్రకాశింపజేస్తుంది.

**ఇప్పుడు కృతి సాహిత్యాన్ని పరిశీలిద్దాము:**

వాచామగోచరమే మనసా వర్ణింపతరమే రామమహిమ త్యాగరాజకృతులలో మొట్టమొదటి పదంలోని భావం మనకు అవగతమైతే, ఆ కృతి స్థాయీభావము సుస్పష్టమౌతుంది.

"వాచామ్ అగోచరమ్" అంటే వాక్కుకి అందనివాడు అని అర్థం. సాధారణంగా కవులకు, వాగ్గేయకారులకు వారి కవితాశక్తితో దేనినైనా వర్ణింపగలమనే అపారమైన విశ్వాసం ఉంటుంది. కాని పరమాత్ముని స్వరూపమూ, లీలావిశేషములూ

వర్ణించే ప్రయత్నం చేసిచేసి, దానికి తమ వాక్కుయొక్క శక్తి సరిపోదని వారు తెలుసుకుంటారు. అటువంటి ఒక సందర్భంలో మహాకవి ధూర్జటి పరమాత్మను వర్ణించడానికి ప్రయత్నించి ఇలా అంటారు:

**ఏ లీలన్ నుతియింపవచ్చు నుపమోత్ప్రేక్షా ధ్వనివ్యంగ్య శ**
**బ్దాలంకార విశేష భాషల కలభ్యంబైన నీ రూపమున్**
**చాలుంజాలు, కవిత్వముల్ నిలచునే సత్యంబు వర్ణించుచో!**
**ఛీ! లజ్జింపరుగాక మాదృశ కవుల్, శ్రీకాళహస్తీశ్వరా!**

"ఓ పరమేశ్వరా! సత్యస్వరూపుడవైన నిన్ను వర్ణించడానికి ఉపమ / ఉత్ప్రేక్ష / ధ్వని / వ్యంగ్య / శబ్ద అలంకారాదులన్నింటితో కూడిన కవిత్వము కూడా చాలదు. నిన్ను వర్ణించడానికి ప్రయత్నించే నాలాంటి కవులకు నిజంగా సిగ్గులేదు." అని తమ అశక్తతనూ, నిస్పృహనూ వ్యక్తంచేస్తారు.

అదేవిధంగా త్యాగరాజస్వామి కృతి ఆరంభంలోనే "రామమహిమ వాచామగోచరము. దానిని వర్ణింపతరము కాదు అని అహంకార సన్యాసం చేశారు.

అయితేమరి రామమహిమను వర్ణించడం ఎట్లు?

అసలు వాచామగోచరమైనదానిని ఎలా దర్శించాలి? అంటే మనస్సుతో దర్శించాలి. అది ఎలాసాధ్యం?

అంటే ఉదాహరణకు దర్పణంలో చంద్రుణ్ణి చిన్నగా చూపించడం సాధ్యం. అంతమాత్రాన అది చంద్రుని నిజపరిమాణం కాదు. చంద్రుని మనం దర్పణంలో దర్శించి, నిజపరిమాణాన్ని మనస్సుతో అంచనావేయాల్సిందే....

అదేవిధంగా వాచామగోచరమైన రామమహిమను ఆయనయొక్క కొన్నిగుణములకు సంబంధించిన కథలను మననం చేసుకొని, మనస్సుతో ఊహించవలసినదే..

దానికై, త్యాగరాజస్వామి ఈ కృతిలో రామునియొక్క దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనే ప్రధానమైన లక్షణములను ఎంచుకొని, వాటికి రెండు ఉదాహరణలను మనకు చూపిస్తారు.

**రేచారి మారీచుని పడగకొట్టి రెండోవాని శిఖికొసగెనే (వా)**

ఈ అనుపల్లవిలో త్యాగరాజస్వామి రామునియొక్క దుష్టశిక్షణాచతురత ఎంత వాచామగోచరమో చూపిస్తారు...

విశ్వామిత్రయాగసంరక్షణ సందర్భములో, యాగవిఘ్నమునకై ప్రయత్నించిన మారీచసుబాహులలో, సుబాహుణ్ణి వధించి, మారీచుని దూరంగా పడగొట్టెను రాముడు.

అలా ఎందుకుచేశాడు రాముడు? అప్పుడు మారీచుణ్ణి చంపలేకనా? అని ఆ సమయంలో ఎంత ఆలోచించినా సమాధానం మనకు దొరకదు. కేవలం ఆయనకు మాత్రమే తెలుసు...

రామావతారలక్ష్యమైన రావణసంహారానికి నాందిపలికే సీతాపహరణకార్యంలో ముఖ్యభూమిక వహించవలసినది మారీచుడేనని......మనవంటివారికి ఆ మహత్కార్యం ముగిసిన తరువాతకానీ అది అర్థం కాదు....

కావుననే, లోకరక్షాధురంధరుడైన రాముడు ఏదుష్టుణ్ణి ఎప్పుడు శిక్షిస్తాడో, ఏరీతిలో శిక్షిస్తాడో తెలుసుకోవడం, ఆయన చాతుర్యాన్ని వర్ణించడం వాచామగోచరమే ....

**మానవతీ మదినెరిగి చామరమౌట కస్త్రమునేయ కని, మానంబుకై మెడ దాచగా మాధవుండు కని కరగి వేగమే దీనార్తిభంజనుడై ప్రాణదానంబొసగ మునుచనిన బాణంబునటు చెదరజేయ లేదా!**

ఈ చరణంలో త్యాగరాజస్వామి రామునియొక్క శిష్టరక్షణాధురీణత ఎంత వాచామగోచరమో చూపిస్తారు...

ఇక్కడ త్యాగరాజస్వామి చూపించిన ఉదాహరణ ఎంతో విచిత్రమైనది. ఇది రామాయణంలోకాని, భారతభాగవతాలలోకాని ఎక్కడా కనబడలేదు....

ఈ సంఘటనలో రాముని త్యాగరాజస్వామి మాధవుడని సంబోధించారు. కాబట్టి ఇది కృష్ణావతారములోని సంఘటన అనుకోవాలా?

ఆలోచిస్తే నాకు ఈ క్రింది విధముగా తోచింది.....

చరణంలో మాధవుడు అనేబదులు రాఘవుడు అన్నా, పాడేటప్పుడు తాళానికి సరిపోతుంది. కాని చరణంలో మానవతి, మానము అనే పదాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి కాబట్టి, స్వామి రామునికి పర్యాయపదంగా మాధవుడు అను పేరును ఉపయోగించారు. కాబట్టి ఇది రామావతారంలో అరణ్యవాసంలో సీతావియోగపూర్వఘట్టము అని నా భావన...

అంతేకాదు, త్యాగరాజస్వామి రాముని తలచుకొని పరవశుడైయున్నప్పుడు, ఆయన హృదయఫలకముపై, రామాయణసంబంధితమైన, రామాయణేతరమైన అనేక కథలు దృశ్యమానమౌతుంటాయి....

అదే దృష్టికోణంలోనుండి ఈ సంఘటనను వివరించే ప్రయత్నం చేస్తాను...

ఒకసారి సీతాదేవి పర్ణశాలలో చామరము(విసనకర్ర)గా ఉపయోగించుకొనుటకు చమరీమృగముయొక్క తోకను తెమ్మని రాముని కోరింది. అప్పుడు రాముడు అక్కడే కనబడిన చమరీమృగముయొక్క తోకను ఖండించడానికై బాణంవేశాడు. అయితే అభిమానవతియైన ఆ చమరీమృగము, తన తోకనుపోగొట్టుకొనుటకు ఇష్టపడక, తన మెడను ముందుకు చాచింది.

దాని అభిమానమును గమనించిన రాముడు, దానిని కరుణించి, తను మొదటవైచిన బాణమును వేరొక బాణముతో పడగొట్టి, ఆ చమరీమృగమును రక్షించెను.

అయితే ఇక్కడ గమనించవలసినదేమిటంటే, మొదట కష్టాన్ని కలిగించినదీ రాముడే, దాన్ని నివారించినదీ రాముడే. అలా ఎందుకుచేశాడు రాముడు?....

దీనిని చమరీమృగముయొక్క దృష్టికోణములోనుండి విశ్లేషిద్దాము....

సీతదేవి చామరము కోరిన సమయములో తాను అక్కడ ఉండడమనేది తన కర్మఫలము. రామబాణము గురితప్పదని దానికి తెలుసు.... కర్మఫలము అనుభవించితీరాలి... అందుకే అది పరిగెత్తే ప్రయత్నం చేయలేదు.... కాని తన తోకకు బదులు తన తలను సమర్పించడానికి సిద్ధపడింది...

**అదే సంపూర్ణశరణాగతి......**

ఆ శరణాగతికి రాముని హృదయం కరిగింది. అందుకే ఆ కష్టాన్ని వెంటనే నివారించాడు... శిష్టరక్షణ చేశాడు. ఈ విధంగా రాముడు కనబరిచే శిష్టరక్షణాచాతుర్యం వాచామగోచరము..

ఈ విధమైన అత్యద్భుత కథాకల్పనాచాతుర్యాన్ని మహాకవులు మాత్రమే చూపగలరు...

**గానలోల త్యాగరాజనుతుమహిమ**

ఈ రెండు విశేషణాలలోనూ, త్యాగరాజస్వామి తాను రాముని శిష్యకోటిలోనివాడిననే నమ్మకాన్ని వ్యక్తంచేస్తున్నారు.

రామా! నీవు గానలోలుడవు, నేను గాయకుణ్ణి. ఈ రకంగా నేను నీవాడను. అట్లే నీవు త్యాగరాజనుతుడవు, నేను త్యాగరాజును.... ఈ రెండువిధాలుగా నేను నీదాసకోటిలోనివాడను అని ఆయనభావం.

**త్యాగరాజహృదయభావము:**

తన మనస్సుకు చెప్పుకున్న ఈ బోధలో త్యాగరాజస్వామి రామునికి పరోక్షంగా తన మనోభావాన్ని వివరిస్తున్నారు.

"ఓ రామా! నీ మహిమ వాచామగోచరము. నీ దుష్టశిక్షణా, శిష్టరక్షణా చతురత మావంటివారి భావనాశక్తికి అందనిది..... ఎప్పుడు నీవు దుష్టులను శిక్షిస్తావో, ఎప్పుడు శిష్టులకు కష్టములు కలిగిస్తావో, ఎప్పుడు నీకు కరుణకలిగి నీవు వారిని రక్షిస్తావో నీకే ఎరుక.

కావున నేను చేయగలిగినది ఒక్కటియే... అదియే సంపూర్ణశరణాగతి.... అదియే నేను నీకుచేయుచున్నాను అని త్యాగరాజస్వామి హృదయభావము...

### Bharat Ratna Musicians – 5

# Renowned Hindustani Vocalist Bharat Ratna Bhimsen Joshi



**Cdr G. Sriramarao,** I.N(Retd)

ఈ శీర్షికలో రాబోయే సంచికలలో గానకళ పాఠకులకు ప్రముఖ సంగీత విద్వాంసులపై భారతదేశంలో వెలువడిన తపాలా బిళ్ళలు మరియు కవర్లు, ఇతర ముఖ్యమైన అంశాలను సచిత్రమాలికగా మనకు అందజేయబోతున్న Cdr G. శ్రీరామారావు (విశ్రాంత ఉద్యోగి) జాతీయ స్థాయిలో పేరొందిన స్టాంపులు, నాణేలు తదితర అమూల్యవస్తువుల సేకరణాభిలాషి.

ప్రత్యేకంగా భారతీయ సంగీతానికి సంబంధించిన కళాకారులపై వెలువడిన పై విషయాలను సేకరించి, పలు పట్టణాల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేసిన ఔత్సాహికులు. భారత నావికాదళంలో కమిషన్డ్ అధికారిగా 1967 నుండి 1993 వరకూ కమెండర్ హోదాలో పనిచేసినవారు. సంగీతాభిరుచి కలిగి 1990-96 ప్రాంతాలలో కులపతి ఐ.వి.యల్. శాస్త్రి గారి మార్గదర్శకత్వంలో గురువులు శ్రీ వి.వి. వి. శంకరం వద్ద సంగీత విద్యనభ్యసించి, డిప్లమో పొందారు.

ఈ సేకరణ క్రమంలో 4000 స్టాంపులు, 200 నాణేలు, 180 కాగితపు కరెన్సీ, సంగీతానికి సంబంధించినవి సంపాదించుటయే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 13 దేశాలలో సంగీతవిద్వాంసుల పేర నిర్వహించబడుచున్న 76 పోస్టాఫీసుల విలువైన సమాచారం కూడా వీరివద్ద ఉంది. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం వారి సంగీత కార్యక్రమాల్లో వీరి సేకరణ ప్రదర్శనను తిలకించిన పద్మవిభూషణ్ శ్రీమంగళంపల్లి బాలమురళీకృష్ణ నుండి ప్రసంశలు అందుకున్నారు. ప్రఖ్యాత మద్రాసు మ్యూజిక్ అకాడమీలో కూడా 2014వ సంవత్సరంలో వీరి సేకరణాంశాలు 4 రోజుల పాటు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో వీరి సేవకు గుర్తింపు లభించింది.

గానకళ ద్వారా ఆ విశేషాలను అందిస్తున్న శ్రీ రామారావు గారికి ధన్యవాదాలు.

---


Pandit Bhimsen Joshi was an Indian Vocalist from Karnataka, in the Hindustani Classical tradition. He is known for the Khayal form of Singing, as well as his popular renditions of devotional music (bhajans and abhangs). Bhimsen Joshi belongs to Kirana Gharana tradition of Hindustani classsical music. Pandit Joshii is noted for his concerts. In fact it was reported that no other singer in India has given so many concerts as Pandit Joshi.

In 1998, he was awarded the Sangeet Natak Academi Fellowship, the highest honour conferred by Sangeet Natak Academi for Music, Dance and Drama. Susequently he received Bharat Ratna, India's highest civilian honour, in 2009. He is also known as the 'God of Singing' or 'God of Music'.



Bharat Ratna Award    Bharat Ratna Award (Reverse Side)





India Post to honour the renowned vocalist of Hindustani music issued a stamp of Rs.25 along with Pandit Ravi Shankar a Sitarist who is also a Baharat Ratna and with six other famous musicians who are and recipients of Padma Vibhushan India's second highest civilian honour, in the form of sheetlet in addition to one sheetlet on each of the eight musicians. This is the first time India Post issued eight sheetlets on musicians.




Sheetlet of the two Bharat Ratnas Pandit Ravi Shankar and Pandit Bhimsen Joshi and six other famous musicians who are Padma Vibhushans

Pandit Bhimsen Joshi was presented Bharat Ratna at his home in Pune Maharashtra in a simple ceremony. The award which was announced after a gap of seven years was presented to the 87 years Bhimsen Joshi by an AddItional Secretary of Home Ministry.

In terms of usual practice Joshi was requested to indicate his preference to coming to New Delhi to receive the decoration of the award of Bharat Ratna from the President Smt Pratibha Patil. However on account of his frail health Panditji requested it to be presented at his home in a low key affair with minimum personnel.

In 1964, King of Afghanistan, Mohammad Zahir Shah, himself invited Pandit Joshi for a concert in Kabul. Between 1964 and 1982 Joshi toured Italy, France, Canada and USA. He was the first musician from India whose concerts were advertised through posters in New York city, United States.



Stamp of Bhimsen Joshi issued in 2014




Sheeetlet of Pandit Bhimsen Joshi

His first music teacher was Channappa of Kurtakoti, who had trained with veteran singer Inayat Khan. Bhimsen Joshi next went to Pandit Shyamacharya Joshi, who was a classical singer who taught him to sing and play Harmonium. It was a turning point when Bhimsen Joshi accompanied Shri Shyamacharya Joshi to Bombay for recording of songs by HMV where Shri Shyamacharya Joshi after recording few songs fell ill and asked Shri Bhimsen Joshi to render the rest of the songs which was a breakthrough in the initial stage of his career. Later he moved to Gwalior and

joined in Madhava Music School a school run by Maharajas of Gwalior, with the help of famous Sarod player Hafiz Ali Khan. He later continued his training with Sawai Gandharva.

He performed live at the age of 19. His album was released by HMV in 1942. Later Joshi moved to Mumbai in 1943 and worked as a Radio artist. His performance at a concert in 1946 won him accolades from his Guru and audience. Later his performances were acknowledged to be marked by spontaneity, accurate note, dizzingly paced taans which make use of his exceptional voice training. Joshi's singing has been influenced by many singers. He along with Smt Gangubhai Hangal and with others took kirana gharana to heights and are proudly referred to as worthy son and daughter of Kirana Gharana.

Pandiat Bhimsen Joshi was widely recognized in India due to his performance in the Mile Sur Mera Tumhara(1988), a national integration song, which begins with him. He was also part of Jana Gana Mana produced by AR Rahman on the occasion of 50th year of India's Republic. He sang in numerous films along with famous musicians both Hindustani and Carnatic and in many languages.

India Post post issued a stamp of Bhimsen Joshi of Rs.3 in 2006 in the series of Makers of India




Pandit Bhimsen Joshi received following awards and recognitions

1972 Padma Shri 1976 Sangeet Natak Academy award 1985 Padma Bhushan

1985 National Film Award for Best Male Playback Singer 1986 FIRST Platinum Disc

1999 Padma Vibhushan 2000 Aditya Vikram Birla Kalashikar Puraskar 2002 Maharastra Bhushan

2003 Swathi Sangeetha Puraskaram by Govt of kerala 2005 Karnataka Ratna

2008 Bharat Ratna 2008 Swami Haridas Award

2009 Lifetime achievement award by Delhi Government

## డాక్టర్ కల్యాణ్ సాగర్ నుంచి ప్రథమ బహుమతిని అందుకుంటున్న ముకుంద్ ప్రవీణ్




అఖిలభారత 20వ బీఎస్ఎన్ఎల్ శాస్త్రీయ సంగీత పోటీల్లో కాకినాడకు చెందిన ముకుంద్ ప్రవీణ్ కు ప్రథమ బహుమతి లభించింది. 15 ఫిబ్రవరి, గురువారం నాగపూర్ లో జరిగిన జాతీయస్థాయి శాస్త్రీయ సంగీత పోటీల్లో ఆ సంస్థ హెచార్ డైరెక్టర్ డాక్టర్ నిప్పని కళ్యాణ్ సాగర్ నుంచి ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. స్థానిక శాఖలో జూనియర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ప్రవీణ్ ఇప్పటికే మూడుసార్లు ప్రథమ బహుమతిని అందుకున్నారు. చిన్నతనం నుంచి సంగీతం అంటే ప్రాణంగా భావించిన ప్రవీణ్.. సంగీత విదుషీమణి పెద్దాడ సూర్యకుమారి వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ప్రస్తుతం వయోలిన్ విదూషీమణి శ్రీమతి బి.వి. దుర్గాభవానీ వారి వద్ద మెరుగులు దిద్దుకుంటున్నారు. ప్రవీణ్ ను ఆ సంస్థ అధికారులు సిబ్బంది ప్రశంసించారు.

# వైద్య సంగీత విద్యా వైభవం

**ఐ. నాగ సుధా ప్రణవ, ఎం. ఏ (సంస్కృతం), డిప్లొమా (హిందుస్థానీ సంగీతం), పి. జి. డిప్లమా (మ్యూజిక్ థెరపీ), పి. హెచ్ డి స్కాలర్(వేదాధ్యయనం ద్వారా సంగీతం, సంగీత చికిత్స)..,వేదిక్ వెల్నెస్ యూనివర్సిటీ నుండి.**

ఓంకార వ్యాప్తమైన ఈ సృష్టిలో నాదము చైతన్యకారకము. ఈ నాదము నుండి వెలువడే శబ్దతరంగాలు వాటి ప్రకంపనాలు ఎంతో శక్తివంతంగా ఈ విశ్వాన్ని సవ్యమార్గంలో నడిపించడానికి కారణం అవుతున్నాయని ఎంతో మంది ఋషులు, మునులు, తాపసులు, యోగులు, మహర్షుల ద్వారా పురాతన కాలం నుండి హేతుపూర్వకంగా నిరూపించిన నిత్యసత్యాలు.

వేద కాలం నుండి వేదాచార్యులు కూడా చతుర్వేదాలలో ఉన్న ఋక్కులకు ఉదాత్త, అనుదాత్త, స్వరిత స్వరాలతో ఉచ్చరించడం ద్వారా శబ్దాలకు అర్థాలు చేకూరుతాయని, స్వరరహిత శబ్దం (వేద పారాయణం) అర్థరహితమని, అందువల్లనే వేద వాఙ్మయాన్ని అర్థవంతం చేయడానికి సామవేదం ఉద్భవించిందని చెప్పారు. అందుకే ఇప్పటికీ స్వరరహితమైన వేద పారాయణం ఎక్కడా జరగదు. ఇంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న నాదం నుండి సంగీతం ఉద్భవించిందని, సంగీతం అంటేనే మనస్సును రంజింపచేయునది అని, ఆత్మను పరమాత్మ దగ్గరికి చేర్చు సులభ మార్గమని జీవకోటికి ఆధారమైనది అని, "నారదీయ శిక్ష"లో నారద మహాముని తెలిపినారు.

సృష్టి, స్థితి, లయకి కావలసిన జ్ఞాన సంపదకు మూలమైన శబ్దాలను శివుడు తన ఢమరుకం నుండి ఉత్పన్నం చేశాడని అవే సంస్కృత వర్ణాలని, సంగీత సప్త స్వరాలని ఆర్యోక్తి.

శివుడు లయకారకుడు. సంగీతం అనగా సుస్వరమైన, మధురమైన, గానంతో, నృత్యంతో ఇంకా సంగీత వాద్యాలతో ఎదుటి వారి మనస్సులను ఆకట్టుకొనేదని, ఆత్మ శుద్ధి చేయగల గొప్ప సాధనమని భరతుడు తన నాట్య శాస్త్రంలో వివరించాడు.

సప్తస్వరాలు (7), సామ వేదంలోని 3 స్వరాలు 5 స్వరాలుగాను, ఆ అయిదు తరవాతి కాలంలో సప్త స్వరాలుగా మారాయని నారదీయ శిక్షలో వివరంగా తెల్పబడినది. అంతేకాకుండా ఈ చరాచర సృష్టికి పార్వతీపరమేశ్వరులు ఏ విధంగా తల్లిదండ్రులయి ఉన్నారో సంగీతానికి శృతి మాతగా, లయ పితగా చెప్పబడ్డాయి. సంగీతము కేవలము స్వర రాగ తాళ కూర్పు మాత్రమే కాదని, వీటి సమ్మేళనంతో భావవ్యక్తీకరణమని, సకల చరాచర సృష్టిలోని ప్రాణులందరికి భాషతో నిమిత్తం లేకుండా అర్థమయ్యే విశ్వభాషయని ఎందరో మహనీయులు చెప్పారు.

వారిలో ప్రముఖులు వారి గ్రంధాల ద్వారా సంగీతాన్ని సామాన్య జనులకు వివరించే ప్రయత్నం

చేశారు. మొదటగా నిత్య నారాయణ నామామృత పానం చేస్తూ తన గానామృతంతో మహతి వాయిస్తూ, సంగీతానికి గల శక్తిని సర్వవ్యాప్తం చేయడంలో ప్రధముడైన నారదుని నారదీయశిక్ష, తర్వాత బ్రహ్మ దేవుని ఆజ్ఞానుసారం భరతుడు రాసిన నాట్యశాస్త్రం సంగీతాన్ని, నాట్యా (ఆంగిక అభినయాల)న్ని, సంగీత వాద్యాలను వాటి ప్రాభవాన్ని తెలిపేవి. ఆ తరువాత బృహద్దేశి, సంగీత మకరందం, మనోల్లాస, సంగీత రత్నాకరం, స్వరమేళకళానిధి మరియు చతుర్దండి ప్రకాశిక వంటి మరెన్నో గ్రంధాలు సంగీత ప్రాభవాన్ని ఎంతో విపులంగా విశదీకరించారయి. వారి ద్వారా అందిన అమూల్యమైన సంపదను తరువాతి తరాల వాళ్ళు గ్రహించి అందులోని రహస్యాలను లోకవ్యాప్తం చేశారు. ఎందరో కళాకారులు, స్వరాలు మంత్రాలమాదిరి పని చేస్తాయని, అంతటి సమ్మోహన శక్తి ఉందని వివరించగా ద్వాపర యుగంలో కృష్ణుడే దీనిని నిరూపించడానికన్నట్లు తన వేణునాదం ద్వారా సర్వ జగత్తును సమ్మోహనపరిచాడు. పంచకోశాలలో ఆఖరుదైన ఆనందమయ కోశంలోకి తీసుకెళ్ళి కర్మవిముక్తులను చేసి జీవన్ముక్తిని ప్రసాదించారు.

ఆహత, అనాహత నాదోపాసనలో కొందరు ఆంతరంగిక అనాహతోపాసన చేసి పరమాత్మునిలో ఐక్యం కాగా, మరికొందరు ఆహతోపాసన (సంగీత నాదోపాసన) చేసి కైవల్యం పొందినట్టుగా అన్నమయ్య ( 1408), పురందర దాసు (1484), మీరాబాయి (1498), తులసీదాసు (1511), రామదాసు (1620), త్యాగరాజు(1767), లాంటి ఎందరో మహనీయులు వారి వారి జీవన విధానాలద్వారా, సంగీతోపాసన ద్వారా సప్రమాణికంగా నిరూపించారు.

ఆనందాన్ని, ఆరోగ్యాన్ని కలిగించే క్రమంలో మనకు తెలియని ఎన్నో రహస్యాలు సంగీతోపాసనలో దాగి ఉన్నట్టుగా మనకు ఇప్పటివరకు తెలియదనే చెప్పవచ్చు. ఆత్మానందం కలగడానికి ఎన్నో మెట్లు దాటవలసి ఉంటుంది, ఎన్నో జీవిత రహస్యాలను తెలుసుకోవలసి ఉంటుంది, అవేంటో ఒకసారి చూద్దాము.

అధ్యాత్మికంగా చూస్తే పంచభూతాత్మకమైన ఈ శరీరంలో షట్చక్రాల బీజ మంత్రాలతో కలిసి ఉన్న ఈ సప్తస్వరాలు మనిషి అంతరంగికమైన స్థూల శరీరం పై ప్రభావాన్ని చూపడమే కాకుండా, కపిల మహాముని ద్వారా చెప్పబడిన సాంఖ్యంలోని 24 గుణాలపై కూడా ప్రభావం చూపుతుందని, సత్వ రజస్తమో గుణాలపై కూడా ప్రభావం చూపి జీవుణ్ణి మోక్షమార్గంలో పయనింపచేయడానికి ఎంతగానో దోహదపడుతుందని ఎందరో శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు వేదకాలం నుండి వారి గ్రంధాలలో వివరంగా రాశారు. అవన్నీ అర్థం చేసుకొనే మానసిక స్థితిలో మనం ఇప్పుడు లేమనడం కఠోర సత్యం. సంగీతం అనేది అధ్యాత్మికంగా, మానసికంగా అలాగే, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచడానికి ఒక దివ్యౌషధంగా పని చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

దీనినే ప్రస్తుతకాలంలో "సంగీత చికిత్స" పేరుతో పిలవడం జరుగుతుంది. కానీ, ఈ విధానాన్ని పూర్వ కాలంలో మన పూర్వీకులు ఆచరించి, కొన్ని వేల సంవత్సరాలు జీవించి ధన్యతను పొందారు అనే సత్యాన్ని వేదాలు, పురాణాలు, చారిత్రిక గ్రంధాలు చెప్తున్నాయి.

మొదటగా సంగీత చికిత్సలో ఇప్పటివరకు ఉన్నటువంటి విభాగాలను చూసినట్లయితే నాదోపాసన, స్వరసాధన, రాగచికిత్స, షట్చక్ర క్రియాసమతుల్యత, సంగీతవాద్య చికిత్స, నాట్య చికిత్స, మంత్ర చికిత్స, ఆయుర్వేద, యోగా, నాదయోగ లాంటివి అతి ముఖ్యమైనవీ, ప్రాచీనమైనవిగానూ వున్నాయని భారత దేశంలో మొదటగా డా. టి. వి. సాయిరాం, డా. మీనాక్షీ రవి, విదూషి. రాజం శంకర్, డా. సుమతీ సుందర్ పరిశోధనాపూర్వకంగా నిరూపించారు.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః" అని ఆర్యోక్తి. అంటే సమస్త జీవులు నాదానికి మంత్రముగ్ధులయిపోతాయని భావం.

ఉదాహరణకి తల్లి పాడే జోలపాటతో శిశువు నిద్రపోవడం, ఏడుపు మానేయడం, పాటలను పాడేవాళ్లను తీక్షణంగా గమనించడం మనం చూస్తూనే ఉంటాం. దీనికి పురాణోత్తముడైన ప్రహ్లాదుని ఉదాహరణగా తీసుకుంటే తల్లి కడుపులో ఉన్నప్పుడు నారదుడు చెప్పిన విషయాలను విని గ్రహించడం, నారాయణ మంత్రాన్ని నేర్చుకొని బయటికి వచ్చి ఆ శ్రీమన్నారాయణుని నృసింహావతారానికి కారకుడవడం మనందరికీ తెలిసిన కథయే. అంతటి చిన్న వయసులో మనోనిగ్రహం, ఆత్మబలం, విద్యా నైపుణ్యం, దృఢ విశ్వాసం, కార్య శీలత, సద్గుణ సంపన్నుడు ఎలా అవగలిగాడు? అతను పురాణ పురుషుడు అంటారా సరే –

ఈ మధ్యకాలంలో పుట్టినవారు... గర్భంలో ఉన్నప్పుడు తల్లి ఏది విన్నా, ఏది చేసినా అది పుట్టబోయే శిశువు గ్రహించి వాటిలో ప్రావీణ్యత పొందుతారు అనడానికి ఎందరో బాల విద్వాంసులు ఉన్నారు.

3 నుండి 4 ఏళ్ల వయసులోనే రాగాల పేర్లు చెప్తూ, పాటలు పాడుతూ, వేదపారాయణం అవలీలగా చేస్తూ, విశ్వంలోని అన్ని విషయాలను గుర్తుపెట్టుకుని చెప్పే ఎందరో చిన్న పిల్లలు మనం ఇప్పటి యూట్యూబ్లల్లో చూస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇవన్నీ సాధ్యమైనప్పుడు ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో సాధన చేస్తే సాధించలేనిదేది లేదని మొన్నటి చంద్రుడిపై మొదటగా దక్షిణ ధ్రువం వైపు కాలిడిన మన భారతీయ చరిత్ర తెలుపుతుంది. విశ్వాంతరాలలో వెళ్లగలుగుతున్న మనం విశ్వంతో సమానమై చిన్న పరిమాణంలో ఉన్న మన శరీరాన్ని అంతర్ముఖులమై తెలుసుకోలేమా? దృష్టిపెడితే తెలుసుకోగలం.

రాగాలకు రోగాలను నయం చేసే శక్తి ఉంది. మంత్రోచ్చారణతో మనిషి మనస్తత్వాన్ని మార్చగలిగే శక్తి ఉంది. నాదోపాసన చేయడం ద్వారా క్రమశిక్షణ,

ఏకాగ్రత, సత్వగుణం ఇంకా జ్ఞాపకశక్తి పెరగడం లాంటివి ఎన్నో జరుగుతున్నాయి. అలాగే మంచి సంస్కారం, మనోవికాసం జరుగుతున్నాయని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. మంచి గురువు లభిస్తే చాలు, త్రికరణశుద్ధిగా ఆచరించడం ముఖ్యం.

పూర్వ కాలంలో త్యాగరాజు తన గంధర్వ గానంతో రాముడిని మెప్పిస్తే, తులసీదాసు హనుమంతుని ఆదరణకు పాత్రుడైతే, శ్యామ శాస్త్రి "నా జీవాధారా" అను కృతితో మృతుని పునర్జీవితుని చేస్తే, నవగ్రహ కృతులు మనిషిని ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవనానికి తోడ్పడితే, ఉత్తర భారత దేశంలో తాన్సేన్ వంటి గాయకులు దీపక్ రాగంతో దీపాలను వెలిగిస్తూ, మేఘ్ మల్హార్ రాగంతో మేఘాలను ప్రేరేపించి వర్షం కురిపించి, దర్బార్ రాగం ద్వారా తన రాజు అక్బర్ కి ఆ రోజంతటి అలసటను తన గానామృత రాగాలాపనతో తీర్చారు. ఇప్పటి కాలంలో వెస్ట్ బెంగాల్ కి చెందిన సంగీతా దాస్ అను యువతి చాలా కాలంగా కోమాలో ఉన్నప్పుడు, ఆమె వైద్యుడు చేసిన చివరి ప్రయత్నం సంగీత చికిత్స (ప్రముఖ వయొలిన్ కళాకారిణి శ్రీ ఎన్. రాజం గారు వాయించిన దర్బారీ కానడ రాగం ద్వారా) తనను కోమా నుండి బయటికి తీసుకురావడం కొన్ని నెలలకు ఆ యువతి మామూలుగా మారడం సంగీతానికి ఉన్న శక్తిని తెలియజేస్తుంది. అలాగే ఎందరో మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలు సంగీతానికి ఆకర్షించబడి అందులో ప్రవీణులవుతున్న సత్యాన్ని "స రె గ మ ప 2023" లో "ఒరేపియా" అనే పాటను అద్భుతంగా పాడిన కార్తీక్ కుమార్ లాంటి గాయకుల ద్వారా తెలుసుకోవచ్చు. ఇలాంటి సంఘటనలెన్నో ప్రతి ఒక్కరి హృదయాన్ని కరిగించాలని, సంగీతం కేవలం ఆనందాన్ని కలిగించేది మాత్రమే కాదని, ఇందులో ఉన్న వైద్య, విలక్షణ సులక్షణాలెన్నో ఉన్నాయని ప్రపంచానికి తెలిసే రోజు తప్పక వస్తుందని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

ఓంకార నాదానికి ఉన్న శక్తిని గురించి వేదాంగాలు, ఉపనిషత్తులు సవివరంగా చెప్పినవి. అలాగే గాయత్రీ మంత్రం, లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం, మృత్యుంజయ మంత్రం, హనుమాన్ చాలీసా వంటి స్తోత్రాలు స్వరయుక్తంగా పాడడం ద్వారా వచ్చే పాజిటివ్ శబ్ద తరంగాల వల్ల మనిషిలోని ఎన్నో రోగాలు నయం అవుతున్నాయని శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించారు. బి పి, షుగర్, సమతుల్యంగా అవుతున్నాయని మానసిక స్వస్థతను చేకూరుస్తున్నాయని దాని ద్వారా రోగాలు రావడం తగ్గుతున్నాయని దేశ(WHO) విదేశాలలోని శాస్త్రవేత్తలు సైతం నిరూపిస్తున్నారు.

వైద్య శాస్త్రంలోని అతి ముఖ్యమైన రహస్యం "మానసిక స్వస్థత". మానసిక రుగ్మతలే శారీరిక అస్వస్థతకు మూలకారణాలని చరకుడు తన చరక సంహిత మొట్టమొదటి భాగంలో వివరించాడు. ఇప్పటికీ వైద్యులు చికిత్స చేస్తూ మానసిక స్వాంతనతో ఉంటే రోగం త్వరగా నయం

అవుతుందని చెప్పడం సర్వసాధారణంగా చూస్తూనే ఉంటాం. అలాంటప్పుడు సంగీతానికి మనస్సును క్రమబద్ధం చేసే శక్తి ఉందని, మనోభావాలపై ప్రభావం చూపుతుందని దీనిద్వారా రోగాలపాలు కాకుండా ఉంటామని చెప్పడానికి ఎందరో సంగీతవిద్వాంసులు ప్రయత్నించారు. వారి జీవన శైలి, సంగీతారాధన వాళ్ళను ఎక్కువ ఏళ్లు బ్రతికేటట్లుగా చేస్తుందనడానికి ఎం. ఎస్. సుబ్బలక్ష్మి అమ్మ, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, పండిట్ రవిశంకర్, ఉస్తాద్ అల్లాహ్ రఖా లాంటి ఈనాటి విద్వాంసులు ఎందరో సాక్షాత్ నిదర్శనాలు అని చెప్పవచ్చు.

**సంగీతం ద్వారా కలిగే ప్రయోజనాలు :-**

1. సంగీతం వాక్శుద్ధిని కలగజేస్తుంది.
2. మేధస్సుని, క్రమశిక్షణను పెంచుతుంది.
3. కాలం విలువను తెలియజేస్తుంది, సత్య గుణాన్ని పెంచుతుంది.
4. మనస్సును సాంత్వనపరుస్తుంది, మనోవికారాలకు గురికాకుండా చూస్తుంది. భావోద్వేగాలను, మానసిక వొత్తిడులను క్రమపరుస్తుంది.
5. షట్చక్రాలను ప్రభావితం చేసి కుండలిని జాగృతికి తోడ్పడుతుంది.
6. మంచి స్వభావాన్ని అభివృద్ధి చేస్తుంది, ఆసక్తిని పెంపొందిస్తుంది, తద్వారా సామాజిక వ్యవహారాలకు దగ్గర చేస్తుంది.
7. కాన్సర్, కోమా వంటి రోగాలను నయం చేస్తుంది.
8. సృజనాత్మకతను పెంపొందిస్తుంది. మనస్సు శరీరం ఆత్మకు స్వస్థతను చేకూరుస్తుంది. మెదడును చైతన్యవంతం చేస్తుంది. వొత్తిడిని దూరం చేసే హార్మోన్లని(డోపోమైన్) విడుదల చేస్తుంది.
9. సంగీతం నొప్పులను తగ్గిస్తుంది, నిద్ర నాణ్యతను పెంచుతుంది.
10. ఇలా ఎన్నో మరెన్నో వైద్య ఉపయోగాలను కలుగచేస్తూ మనిషికి మంచి మానసిక, శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యజీవితాన్ని అందించడమే కాక ఆత్మను పరమాత్మ దగ్గరికి చేర్చగల అతి సులభమైన మార్గం.

మన ఆత్మను ఈ ప్రక్రియలో సంధానపరచగలగడం చాలా ముఖ్యమైన అంశం. "మనసొక చోట మనువొక చోట" అన్న రీతిని వున్నప్పుడు ఏ విధానమూ పని చేయదు. ఇటీవలే రోగికి యిష్టమైన, మనస్సును ఆనందతరంగితం చేసుకొనే సినిమా చూస్తూ ఉండమని, మెదడుకు శస్త్ర చికిత్స చేయడం ప్రత్యక్షంగా చూశాం.

ఈ విధమైన నాదోపాసన ద్వారా మనం రోగాలపాలు కాకుండాను, రోగాలను నివారించుకోవడంలోను సఫలీకృతులమవుతామని ఆశిస్తూ !

పెద్దలకు వందన మందారాలు !

# 'హరికథక రాజహంస', 'కళాప్రపూర్ణ' డా. అమ్ముల విశ్వనాధ భాగవతార్



మన దేశంలో "హరికథ" అన్న సాహిత్య ప్రక్రియ చిరకాలం నుండి ప్రచారంలో ఉంది. మన ఆంధ్ర సాహిత్యంలో అది ఒక విశిష్ట ప్రక్రియగా ప్రసిద్ధికెక్కింది. మన ఆంధ్రదేశంలో 'సంగీత సార్వభౌమ', 'హరికథా పితామహ', 'మహాకవి' ఆదిభట్ల నారాయణదాసు గారి పేరు విననివారు ఉండరు. దాసుగారి శిష్య ప్రశిష్యులైన హరిదాసులు మన రాష్ట్రములోను, ఇతర రాష్ట్రముల్లోను పండుగల్లో, పర్వదినాల్లో దేవాలయాలలో వివిధ కార్యక్రమాల్లో సుప్రసిద్ధ ఇతివృత్తాలతో "హరికథాగానములు" చేస్తూ హరికథా రంగానికి వన్నె తెస్తూ ఉండేవారు. అటువంటి సత్సంప్రదాయాన్ని నిలబెట్టిన కళాప్రపూర్ణ డా. అమ్ముల విశ్వనాధ భాగవతార్ గారు సాహిత్య సంగీత నృత్య కళా విశారదులు. వీరు సహజకవి, మహాపండితులు. సంస్కృతాంధ్ర భాషలలో వీరి పాండిత్యం అపారమైనది.

వీరు, 21 జనవరి 1916 సం. లో కృష్ణా జిల్లా దివిసీమలో పండితులకు నిలయము అయిన నంగేగడ్డ అనే కుగ్రామంలో జన్మించారు. వీరి పూర్వీకులు అందరూ సంగీత, నృత్య, వాయులీన, మృదంగ విద్వాంసులు. తల్లిదండ్రులు కూడా సంగీత విద్వాంసులు. అమ్ములవారు వీధి బడులలో తాటాకు పుస్తకములతో, బాల రామాయణం , పెద్ద బాలశిక్ష, అమరం చదువుకుంటూ మేనమామ దగ్గర వయోలిన్, బాబాయి వద్ద మృదంగం అభ్యాసం చేసేవారు. బాల్యం నుండే కవితలు వ్రాసేవారు. చదువుకుంటూనే, మృదంగం మాత్రం విడువక భజనలు, నాటకాలకూ వాయించేవారు.

వీరు 18వ ఏట నుండి మృదంగం పలు చోట్ల వాయించేవారు – కూచిపూడి వేదాంతం రాఘవయ్యగారి వంటి ప్రముఖులకు కృష్ణా జిల్లా చల్లపల్లి వద్ద యార్లగడ్డలో 'ఉషాపరిణయం' అను నాటకానికి తెల్లవార్లూ కూడా నిలబడి మృదంగ సహకారం అందించిన ఘనులు. నాటకాలలో పాత్రలు కూడా వేసేవారట. 20వ ఏట కోడాలి

గ్రామములో మొదటగా నాటకాలలో నారద పాత్ర ధరించారు. వీరిది శ్రావ్యమైన కంఠము అవుటవలన క్రొత్తగా గ్రామఫోన్ రికార్డులు వచ్చిన ఆ రోజులలో వీరి ఇంటివద్ద వారందరూ వీరిచేత బెంగుళూరు నాగరత్నమ్మ గారుపాడే 'సుజన జీవన రామ సుగుణ భూషణ రామ' అనే త్యాగరాజ కృతిని మరియు సంగతులు వారి గొంతుద్వారా విని అభిమానించేవారట. వీరికి చిన్నపటి నుండి గ్రంథాలయములో పుస్తకములు, వివిధ గ్రంథములు పఠనము చేసే అలవాటు. అదే గ్రంథాలయంలో బాలాజీదాస విరచిత 'రుక్మాంగద చరిత్ర' హరికథ పుస్తకమును తీసుకొని ఏకలవ్య దీక్షతో పటించడం, వల్లెవేయుటము జరిగింది. వీరి 19వ ఏట వారి గ్రామములోని స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయములో 'రుక్మాంగద చరిత్ర' హరికథ చెప్పుటకు హరికథకులు రాని ఒకానొక సందర్భములో ' మృదంగ సహకారం అందచేయుటకు వచ్చిన అమ్ముల వారు హరిదాసు అవతారం ధరించి అదే 'రుక్మాంగద చరిత్ర' హరికథాగానం చేసి కార్యక్రమ నిర్వాహకులను, శ్రోతలను ఉత్తేజ పరిచినారు.

దాసవర్యుల ప్రశిష్యుల కోవలోకి చెందినవారు శ్రీ అమ్ముల విశ్వనాధం గారు. శ్రీ కొఠరు వెంకట సుబ్బయ్య దాసు భాగవతుల వద్ద కొంత శుశ్రూష చేసి (అప్పటికే కొఠరు వారు దాసుగారి కథలు చెపుతూ ఉండేవారట) వారి నుండి ఒక కథ ప్రారంభించి, వ్రాసుకొని, సాధన చేసి పలుచోట్ల కథాగానం చేయటం మొదలు పెట్టారు. అప్పటి నుండి నారాయణ దాసుగారి రచనలందు అనురక్తి, ఆకర్షణ కలిగింది. ఆదిభట్ల నారాయణదాసుగారి పోలికలు కొన్ని అమ్ములవారిలో ప్రస్ఫుటముగా కనిపిస్తాయి (దాసుగారిలా చిన్నప్పటి నుండి నాటకములు వేయాలనే అభిలాష, వారిలా 19వ ఏట హరికథకునిలా అవతారము ఎత్తుట, కట్టు, బొట్టు, జులపాల జుట్టు, మీసకట్టు, ఒడ్డు, పొడుగు, నాట్యాభినయం మున్నగు విషయములలో). అమ్ముల వారు నారాయణదాస వర్యుల శిష్యులు కాకున్నను శ్రీవారి భక్తుడనని, శిష్యుడనని సగర్వంగా చెప్పుకొనేవారు. వీరు కథకులే కాక సహజ కవి, సల్లలిత కవిత లల్లగల కవి తల్లజుడు. అది 1941 సం. ఆగష్టు మాసం -- అప్పటికే అమ్ములవారికి హరికథలలోను మరియు విడిగా పట్టుబట్టలు మాత్రమే ధరించే అలవాటు. విజయవాడలో మణికొండవారి బట్టల దుకాణములో పట్టుబట్టలు కొనటానికి వెళ్ళినప్పుడు -- అక్కడ ఆదిభట్ల నారాయణదాసు గారు బసచేసి ఉన్నారని బట్టలకొట్టు వారు చెప్పగా తెలుసుకొని -- 'పుంభావ సరస్వతిని' కలసి, దాసుగారి యదార్ధ రామాయణం పుస్తకాన్ని వారి అన్న పేరన్న గారిద్వారా Rs.2.50 చెల్లించి పుస్తకము దాసుగారికి అందిస్తే, వారు అమ్ములవారిని దీవించి తిరిగి ఇచ్చారట. దాసుగారిని విడిచి రాలేక (విడువరాదెంతైనా వెర్రివాడనైనా నీకు.. కడవారు నవ్వకుండా కాచుకో నన్ను... అని అన్నమయ్య వారన్నట్లు...) వారి పాదములకు కొద్దిసేపు సేవచేసుకొని, వారి పాదమునకు గల బంగారు కడియం తదేక దీక్షతో అటు ఇటు తిప్పుతూ చూసి 'అపర నారదునకు' నమస్కారము చేసి వెనుతిరిగారుట.

అమ్ములవారు అంటూ ఉండేవారు నారాయణదాసు గారి ఎదుట హరికథా గానము చేయడటం అంటే సాహసము చేయడటమే అని. అటువంటిది, మరి మన అమ్ములవారు ఎంత భాగ్యశాలి అంటే -- తేదీ 2-1-1943న పశ్చిమ గోదావరి జిల్లా భట్లమగుటూరులో త్యాగరాజ మహోత్సవముల సందర్భముగా దాసుగారు అక్కడకి విచ్చేసి రుక్మిణీకల్యాణము చెప్పగా విని, అటు పిమ్మట 4, 5 రోజుల తరువాత వారి ఎదుట దాసుగారి 'సీతాకల్యాణము' హరికథ చెప్పి వారిచే శభాష్ అని అనిపించుకొన్న ప్రతిభాశాలి. అమ్ముల వారి కథ విన్న తరువాత నారాయణదాసు గారు వారి ప్రియశిష్యులైన వాజపేయాజుల సుబ్బయ్య దాసుతో ... ఒరేయ్ సుబ్బిగా .. వీడి అట పాట మాట బాగుందిరా, కథ క్రమం తప్పకుండ చెపుతున్నాడురా .. వీడు తప్పక వృద్ధిలోకి వస్తాడురా అని అన్నారుట. దాసుగారి తొలి కథను సుబ్బయ్య పంతులుగారి వద్ద వల్లించి, తదాది దాసు గారి అన్ని కథలు - యదార్ధ రామాయణము , అంబరీష చరిత్ర, ప్రహ్లాద చరిత్ర, మార్కండేయ చరిత్ర, జానకీ శపథము, సావిత్రీ చరిత్రము, రుక్మిణి కళ్యాణం, హరికథామృతములోని 'శ్రీకృష్ణ జననము' స్వయంకృషితో నేర్చుకోని చెప్పుచూ దాసుగారి యశస్సును దశదిశలా వ్యాపింపచేసిన అలనాటి మహానుభావులు అమ్ములవారు. ముఖ్యముగా దాసుగారు రచించిన జానకీశపథం (ఉత్తర రామ చరిత్ర) కథ చెప్పాలంటే సామాన్య విషయం కాదు. ఎందుకంటే ఇది ఒక సంగీత కళాఖండం, కీర్తనలు 72 మేళకర్త రాగాలలో అంటే పూర్వాంగ, ఉత్తరంగా రాగాలలో ఉంటాయి. మరి అమ్ములవారు అవలీలగా ఈ కీర్తనలు పాడేవారట. ఇది వారిలోని ప్రతిభకు తార్కాణం. దాసుగారి ప్రియశిష్యులైన నేతి లక్ష్మీనారాయణ భాగవతులు, వాజపేయాజుల సుబ్బయ్యదాసు గార్ల యందు భక్తి వినయములు కలిగి ఉండి, వీరిని మార్గదర్శకులుగా భావించి, వీరివద్ద దాసుగారి కథలలో మెళుకువలు తెలుసుకొనేవారు.

ఆదిభట్ల వారి అడుగుజాడను గురుజాడగా భావించి హరికథను నవ్యాతి నవ్యముగా తీర్చిదిద్దిన బహుముఖీయులు విశ్వనాథ భాగవతులు. ఎటువంటి సౌకర్యములు లేని ఆ రోజులలో ఎన్నో కష్టనష్టాలకోర్చి స్వయం కృషితో ఎదిగి హరికథను భక్తి మనోరంజకముగా చెప్పటానికి కావలసిన విద్వత్తును సముపార్థించుకొని వినయ వివేక లక్షణాలతో విరాజిల్లుతూ అద్భుతముగా, అనితరసాధ్యముగా, హృద్యముగా జాతికి భక్తిని హరకథమాధ్యమంగా అందించిన మహనీయుడు అమ్ములవారు. సంగీత సాహిత్యాల కుటుంబం కావడంతో ఒక కుసుమంగా వికసించి పారిజాతంగా వెలుగొందారు విశ్వనాథంగారు. సంప్రదాయినికి కట్టుబడి ఆ విలువలు పోషించుకుంటూ, భక్తి చైతన్యం కలింగించడమే గాక ధర్మ జాగృతిని కలిగిస్తూ హరికథను ఒక సాధనం (అమ్ము)గా ఉపగోయించి క్రొత్త పుంతలు తొక్కించిన అమ్ములవారు చిరస్మరీణుయులు. నిత్య విద్యార్థిగా నిరంతర విషయ సేకరణ, బహు గ్రంథ పఠనముతో సాగిన అయన జీవనం హారికథాగాన వైభవానికి ఎంతో దోహదపడుతూ వారి ప్రతీ కథాగానం

కొత్తదనంతో అలరారేది.

హరికథను కేవలం ధనార్జన కొరకేగాక, మిగిలిన కళల సరసన పెద్దపీటపై కూర్చోబెట్టే ప్రయత్నం చేసారు అమ్ములవారు. అమ్ములవారితో మాట్లాడాలని ఎవరు ఎప్పుడు వెళ్లినా, వారు గ్రంథ పఠనంలోనే కనపడుతూ ఉండేవారట. శ్రీమదజ్జాదిభట్ల నారాయణదాసుగారి కారణంగా హరికథ ఒక గొప్ప విద్యగా ఫరిఢవిల్లింది. కవులు, గాయకులూ, పండితులు, తత్వవేత్తలు అందరూ హరికథా కళకు నీరాజనం పట్టినారు. అట్టి మహానుభావుని ఏకలవ్య పద్ధతిలో అరాధించినారు అమ్ములవారు. వీరి ప్రసంగంలోకాని, కథాగానంలోకాని శ్రీ నారాయణదాసుగారి ప్రశంస లేకుండా ఉండేది కాదు. ఆదిభట్ల నారాయణదాసు గారంటే వీరి దృష్టిలో అవతారమూర్తి. చాలా వరకు వీరు నారాయణదాసుగారిని అనుకరించడం, కథా సంవిధానములో ఆదిభట్ల వారి హృదయాన్ని అనుకరించాలనే తపన వీరి కథాగానంలో అడుగడునా కనబడేది. వీరు నారాయణదాసు గారి కథలే గాక, శ్రీ పరిమి సుబ్రహ్మణ్యం భాగవతులు మరియు శ్రీమాన్ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసు గార్ల కథలు కూడా గానము చేసే వారు. శ్రీమాన్ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసు, ముసునూరి సూర్యనారాయణమూర్తి భాగవతులు, భమిడిపాటి వెంకటనారాయణ వంటి వారిని ఆదర్శముగా తీసుకున్నారు.

ప్రకాశం పంతులుగారన్నట్లు "జాతిని చైతన్యం చేయుటలో వేయి పత్రికలు చేయలేని పనిని ఒక్క హరిదాసు చెయ్యగలడు" అన్నది విశ్వనాథం భాగవతార్ విషయంలో అక్షరసత్యం అయినది. గాంధేయ వాది కావడంతో దేశభక్తి తో పాటు, సామజిక అంశాలు ఎన్నో అయన హరికథాగానంలో చోటుచేసుకొనేవి. గాంధీజీ నాయకత్వాన్ని గురించి హరికథలు చెప్పుతూ ప్రజలను ఎంతో చైతన్యపరచిన జాతీయ హరికథా వైతాళికుడు అమ్ముల వారు. హరికథల ద్వారా జాతీయ భావాలను పూరించి, దేశభక్తి గీతాలాపనలతో ఎందరో యువకులను స్వాతంత్ర సమరంలోకి ఉరికేలా ఉత్తేజపరచిన దేశోద్ధారకులు అమ్ముల వారు. సామాన్యులను కూడా విజ్ఞానవంతులను చేసే విధముగా హరికథలు చెప్పేవారు. విశిష్టమైన వ్యక్తిత్వం, ఎవరు ఎప్పుడు ఎక్కడ కనబడినా కౌగిట చేర్చి మాట్లాడడం అమ్ములవారి ఆప్యాయతను బహిరంగపరిచే లక్షణం. మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు (మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ విద్యాశాఖ మంత్రి వర్యులు) అమ్ములవారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ పంపిన సందేశములో "వీరి హరికథలు, జాతీయ గేయాలు విని జాతీయ భావాలను పెంచుకొని, గాంధీజీ యెడల భక్తి ప్రపత్తులు ఏర్పర్చుకొన్నాను. నాకు రాజకీయంగా స్ఫూర్తిని ఇచ్చిన వారు అమ్ములవారు. వారిని నేనెప్పటికీ మరువజాలను" అని తెలియచేసారు.

అలనాడు వివిధ రంగములలో నిష్ణాతులైన సర్వశ్రీ విశ్వనాధ సత్యనారాయణ, జి ఎన్ బాలసుబ్రహ్మణ్యం, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, పుట్టపర్తి నారాయంచార్యులు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, తెన్నేటి విశ్వనాధం, గుర్రం జాషువా, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి, భమిడిపాటి కామేశ్వర

రావు (హాస్య రచయిత), డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంటి వారితో అమ్ములవారికి ప్రగాఢమైన పరిచయము, సాన్నిహిత్యం ఉండేది. వీరందరూ కూడా వారి కథలు ఆసాంతం విని ఆనందించిన వారే. ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడెమి మెంబరుగా కూడా సేవలందించారు

అమ్ములవారి గురించి 'కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి ప్రశంస "సొమ్ములు వాగ్దేవికి సర సమ్ములు : సంగీత సహజ సౌందర్య విలాసమ్ములు : మధురమ్ములు మా అమ్ముల తమ్ముల మనోహరాలాపముల్".

వీరి హరికథా జీవన ప్రయాణములో కొన్ని ముఖ్య సన్నివేశములు : 1959 పుణేలో అవతార్ మెహర్ బాబా సమక్షం లో వారి జీవిత చరిత్ర చెప్పి బాబా వారిచే సన్మానం; 1966 లో అలనాటి రాష్ట్రపతులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వారి సమక్షంలో ఒకసారి మరియు 1972 లో శ్రీ వి. వి. గారి సమక్షంలో తమ హరికథా గానామృతమును ప్రదర్శించి వారి మన్నలను, గౌరవ సత్కారముల స్వీకరణ; 1975 సత్యనారాయణపురం సీతారామ కల్యాణమండపములో 40 రోజులపాటు మహాభారతం కథాగానం – కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి, కలగ ఆంజనేయ శాస్త్రి, డాక్టర్ దమ్మాలపాటి రామారావు గార్ల సమక్షంలో 'హరికథక రాజహంస' బిరుదు ప్రధానం .. (కలగా వారు ప్రతీ రోజు ఒక తెల్ల కాగితం పెన్ను పట్టుకుని .. అమ్ములవారి కథలో ఎక్కడైనా తప్పులు దొర్లుతాయేమో అని చూసే వారట ... ఆఖరి రోజున అమ్ముల నువ్వు గెలిచావు నేను ఓడిపోయాను అని అన్నారుట); 1977 గుంటూరులో రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయమునందు దాస వర్యుల యదార్ధ రామాయణం కథాగానం -- అలనాటి కవితా సాహిత్య రంగములలో ఉద్దండులైన సర్వశ్రీ కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి, జమ్మలమడక మాధవరామ శర్మ, ఏలూరుపాటి అనంతరామయ్య, కోగంటి సీతారామాచార్యులు, ఓరుగంటి నీలకంఠశాస్త్రి, వింజమూరి శ్రీనివాసాచార్యులు, ఆచార్య ఎస్ వి జోగారావు మరియు నారాయణదాసు వర్యుల మునిమనుమలు శ్రీ కర్రా ఈశ్వర రావు గారి సమక్షంలో 'నవరస మధుర సరస్వతి 'బిరుదు' ప్రదానము; 1981 అలనాటి ఉమ్మడి తెలుగు రాష్ట్రములో శ్రీ టి. అంజయ్య గారు ముఖ్య మంత్రి ఉన్నప్పుడు (శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ గారు తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా ఉన్న సమయములో) టి. టి. డి. ఆస్థాన విద్వాంసులుగా నియామకం); 1987 రాజమండ్రిలో చేసిన హరికథాగాన సందర్భాన శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి ద్వారా (సర్వశ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, మానాప్రగడ శేషసాయి, బుగ్గా పాపయ్య శాస్త్రి సమక్షంలో) సువర్ణాభిషేకం, 'హరికథా గాన భాస్కర' బిరుదు ప్రధానం; 1987 ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రములో తెలుగు లలిత కళాతోరణంలో నోబెల్ గ్రహీత మదర్ థెరిస్సా, కళాభిమానులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, అలనాటి మంత్రివర్యులు శ్రీ కే రోశయ్య సమక్షంలో ★కళా వేదిక హైదరాబాద్★ వారి ★'ఆంధ్ర రత్న'★ బిరుదు ప్రధానము; 1990 అన్నవరం సత్యనారాయణస్వామి వారి శతజయంతి

ఉత్సవములలో కథాగానం – భారత ఉపరాష్ట్రపతి శ్రీ శంకర దయాల్ శర్మ గారిచే సన్మానము.


వీరు తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వర పురంలోని 'శ్రీ సర్వరాయ హరికథా' పాఠశాల ప్రిన్సిపాల్ గా పనిచేసి ఎంతోమంది హరికథా కళాకారిణులను తయారుచేశారు. అమ్ముల వారి శిష్యులలో ముఖ్యులు శ్రీమతి వై. శిఖామణి (రామచంద్రాపురం), శ్రీమతి వి. విజయకుమారి భాగవతారిణి, శ్రీ కాట్రగడ్డ ప్రకాశరావు (విజయవాడ), శ్రీ దొర చిన బాబు దాసు (శ్రీకాకుళం), శ్రీమతి కమలారాణి (తెనాలి), శ్రీమతి కోటేశ్వరమ్మ (రేపల్లె వద్ద ఓలేటి గ్రామం), శ్రీమతి పువ్వుల రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అమ్ములవారు జీవిత కాలమంతా హరికథా గానములకే అంకితము చేసి క్షేత్ర స్థాయి నుండి, పలు జిల్లాలలో, రాష్ట్రములలో ప్రదర్శనలు ఇవ్వటమే కాకుండా, దేశము నలుమూలలా, మరియు ప్రపంచ తెలుగు మహాసభలు జరిగిన హైదరాబాద్ లోనే కాక కౌలాలంపూర్ (మలేసియా), మారిషస్ వంటి ఇతర దేశములలో కూడా హరికథాగానములను సహృదయరంజకంగా కథాగానము చేసి అనేక సత్కారాలు, బహుమతులు, బిరుదులూ ('దివిసీమ రత్న', 'హరికథా కళాకోవిద', 'హరికథా చూడామణి') పొందారు. వీరు వివిధ కళాప్రపూర్ణులు కనుకనే ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు వీరిని "కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేట్ బిరుదుతో సన్మానించారు. హరికథా ప్రపంచానికి ఆయన రవితేజోమూర్తి, కథాగాన యుగపురుషుడు, కథాగాన ఆకాశంలో అయన ఒక ధృవతార. వారి జీవితం నిరంతర విద్యార్థి గానే కొనసాగింది ('వచ్చేవరకు వల్లించాలి .. చచ్చేవరకు సాధించాలి'.. అని అంటూ ఉండేవారు అమ్ములవారు). జీవితమున ఎట్టి లోటు లేకుండా తృప్తితో, ఉత్సాహముతో, ఉల్లాసముతో, గౌరవముతో హాయిగా కాలం గడపిన ధన్యజీవి మన అమ్ముల విశ్వనాధ భాగవతులు గారు .. మనకు చిరస్మరణీయుడు.

( కీ. శే. అమ్ముల విశ్వనాధ భాగవతార్ గారి 108వ జయంతి ( తేదీ 21 జనవరి) సందర్భముగా ఈ వ్యాసము ప్రచురించుటం జరిగినది.

సంకలనం : **యనమండ్ర వెంకట కృష్ణయ్య**

వ్యవస్థాపకుడు : అన్నమయ్య పరివారము, హైదరాబాదు; మరియు 'హరికథా కేసరి' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతుల దౌహిత్రుడు.



# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## సంగీత విద్వత్సభ, కాకినాడ

సంగీత విద్వత్సభ, కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళా మందిరం వేదికగా ది.19.1.2024 నుండి 28.1.2024 వరకు సంక్రాంతి సంగీతనృత్య కార్యక్రమాలు జరిగాయి. మొదటిరోజు లతాంగి సోదరీమణులు అర్చన – సమన్విల గాత్ర కచేరి ప్రతిభావంతంగా జరిగింది.

వీరు వసంత రాగంలో సీతమ్మ మాయమ్మ, బిలహరి రాగంలో దొరకునా, బృందావన సారంగ రాగంలో రంగపుర విహార మొదలైన కీర్తనలు గానం చేసారు. వీరికి వయోలిన్ పై బసవరాజు రాఘవేంద్రరావు, ఆంబూర్ పద్మనాభన్ మృదంగం పై, కె. వి. వెంకట సుబ్రసుబ్రహ్మణ్యం ఘటంపై చక్కటి సహకారాన్ని అందించారు.

ప్రొఫెసర్ కె. వి. ఎస్. జి. మురళి కృష్ణ గారు జ్యోతి ప్రజ్వలన చేయగా కార్యక్రమం ఎన్. సి. ఎస్. గ్రూప్ ఆఫ్ కంపెనీస్, వసుధ ఫౌండేషన్ సౌజన్యంతో జరిగింది.

రెండవ రోజు కార్యక్రమం ప్రవీణ్ పండిట్, చెన్నై శాక్సోఫోన్ వాయిద్యం ప్రేక్షకులను అలరించింది. వీరు హంసధ్వని రాగంలో వాతాపి గణపతిం భజే, శ్రీరాగంలో ఎందరో మహానుభావులు, అభేరి రాగంలో నగుమోము గనలేని మొదలైన కీర్తనలు వాయించారు. వీరికి వయోలిన్ పై బసవరాజు రాఘవేంద్రరావు గారు, ఆంబూర్ పద్మనాభన్ మృదంగం పై, కె. వి. వెంకట సుబ్రసుబ్రహ్మణ్యం గారు ఘటంపై చక్కటి సహకారాన్ని అందించారు.

LN. ముంజులూరి విశ్వేశ్వర రావు గారు, రాయవరపు సంజీవరావు గారు, ప్రభల రాజేశ్వరి గారు జ్యోతి ప్రజ్వలన చేయగా డా. S. V. రావు గారు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమం డా.సంకురాత్రి చంద్రశేఖర్ గారు, రాయవరపు వారి సౌజన్యంతో జరిగింది.

ఈ సందర్భంగా ది.21.1.2024 ఆదివారం రాష్ట్ర స్థాయి వీణ, గాత్ర పోటీలు రెండు రాష్ట్రాల తెలుగు వారికి జరిగాయి. హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి మొదలైనప్రాంతాలనుండి పోటీదారులు పాల్గొన్నారు. సర్వశ్రీ ద్విభాష్యం నగేష్ బాబు, రెహమాన్, చిలుకూరి సుబ్బలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గెలుపొందిన అభ్యర్థులకు వంగూరి చిట్టెన్ రాజు గారు బహుమతి ప్రదానం చేసారు.

మూడవ రోజు కార్యక్రమం డా. శ్రీమతి రాజేశ్వరి సాయినాథ్ మరియు శిష్య బృందంతో చేసిన నృత్య ప్రదర్శన జరిగింది.

శాంతాకారం భుజగ శయనం శ్లోకంతో ప్రారంభించి నాట్య ప్రదర్శన లో ముఖ్యంగా సింహేంద్ర మధ్యమం రాగంలో వర్ణం నాట్య ప్రియులను ఆకట్టుకున్నది. అభేరి రాగంలో "నగుమోము గనలేని" వంటి అంశాలకు నర్తించారు. వారి శిష్యులు సృజన వలివేటి, కీర్తి వలివేటి, కీర్తిశ్రీ, హరిత కణ్ణదాసన్ చక్కగా నర్తించి అభినందనలు పొందారు.

చాగంటి కోటీశ్వర రావు గారు జ్యోతి ప్రజ్వలన చేయగా ఈ కార్యక్రమం కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్. ఎల్. ఏ. ద్వారంపూడి చంద్రశేఖర్ గారి సౌజన్యంతో జరిగింది.

ది.22.2.2024న అయోధ్యలో శ్రీరాములవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక కళాకారులు వాగ్గేయకారులు రచించిన అనేక కీర్తనలను గానం చేసి స్వరార్చన చేసారు.

సీతారామ లక్ష్మణ హనుమ విగ్రహములను ఊరేగించి జై శ్రీరాం నినాదంతో ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తూ విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో స్వరార్చన జరిగింది. మొదట శ్రీ నజీర్, శ్రీ రాయుడు నాదస్వరం తో ప్రారంభ మయింది.

ఈ కార్యక్రమంలో శ్రీమతులు పెద్దాడ సూర్యకుమారి, జి. అరుణ, చిలుకూరి సుబ్బలక్ష్మి, చావలి సూర్యకుమారి, ప్రభల రాజేశ్వరి మొదలైన కళాకారులు మరియు వారి శిష్యులు పాల్గొన్నారు.

నాల్గవ రోజు కార్యక్రమం దార్వాడ్ ఘరానాకు చెందిన పండిట్ మొహాసిన్ సితార్ మరియు అరణ్య కుమార్ గారి ఎస్రాజ్ వాయిద్యాలతో కచేరి రంజకంగా జరిగింది.

వారు బారు బేహాగ్, కీరవాణి, దర్బారి కానడ, మిశ్ర శివరంజని రాగాలలో విడివిడిగా మరియు జుగల్బందీగా చక్కటి సంగీతాన్ని అందించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.

ఎస్రాజ్ అనే వాయిద్యాన్ని కాకినాడ సంగీత ప్రియులకు మొదటి సారిగా పరిచయం చేయడం జరిగింది. వీరికి తబలాపై ఉస్తాద్ నజ్ముద్దీన్ జావెద్ చక్కటి సహకారాన్ని అందించారు.

ద్విభాష్యం నగేశ్ బాబు, సుభాషిణి గారలు జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఐదవ రోజు కార్యక్రమం గా చెన్నై వాస్తవ్యులు కళ్యాణపురం అరవింద్ గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది.

కాంభోజి వర్ణంతో ప్రారంభించి, సింహేంద్ర మధ్యమం లో రాగం తానం పల్లవి చేసి, వివిధ వాగ్గేయకారులు రచించిన రామచంద్ర మూర్తిపై కృతులను చక్కగా గానం చేసారు. వీరికి వయోలిన్ పై శ్రీ పప్పు జ్ఞానదేవ్, చెన్నై, మృదంగంపై శ్రీ బుర్రా శ్రీరామ్, చెన్నై, ఘటం పై శ్రీ ఎమ్. హరిబాబు చక్కటి సహకారాన్ని అందించారు.

శ్రీమతి ఎస్. సీత జ్యోతి ప్రజ్వలన చేయగా ఈ కార్యక్రమం కాకినాడ సీ పోర్ట్స్, డా. జి. సీతారామస్వామి గారు, డా. జి. అనూరాధ–పిఠాపురం వారల సౌజన్యంతో జరిగింది.

ఆరవ రోజు కార్యక్రమం చెన్నై వాస్తవ్యులు విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరి ప్రతిభావంతంగా జరిగింది. అఠాణ రాగంలో బాల కనకమయచేల తో ప్రారంభించి, శంకరి శంకురు చంద్రముఖి మొదలైన కీర్తనలు గానం చేసారు. వీరికి వయోలిన్ పై శ్రీ వి.ఎస్.పి. గాయత్రీ శివాని, మృదంగంపై బుర్ర శ్రీరామ్, ఘటం పై శ్రీ ఎస్. హనుమంతరావు సహకారాన్ని అందించారు.

సరస్వతుల హనుమంతరావు గారు జ్యోతి ప్రజ్వలన చేయగా తరువాత సభ వారు, అయోధ్య రామ మందిరంలో ఘటంపై సహకరించిన ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి కళాకారునిగా హనుమంతరావుగారిని సత్కరించారు. ఈ కార్యక్రమం డా. ఎమ్.వి.భారత లక్ష్మి, శ్రీ వి. కాంబాబు, శ్రీమతి మీనాక్షి గార్ల సౌజన్యంతో జరిగింది.

ఏడవ రోజు కార్యక్రమం బెంగళూరు వాస్తవ్యులు శ్రీ హరిహరన్ మరియు శ్రీ అశోక్ (బెంగళూరు సోదరులు) గాత్ర కచేరి రక్తిగా జరిగింది.

వింజమూరి వరదరాజ అయ్యంగార్ వారి వర్ణంతో ప్రారంభించి, కేదారం రాగంలో రామ నీపై నాకు, హుసేని రాగంలో రామ రామ రామ

సీత మొదలైన కీర్తనలు చక్కగా గానం చేసారు. వీరికి వయోలిన్ పై శ్రీ మావుదూరి సత్యనారాయణ శర్మ, ఆముదాలవలస, మృదంగంపై శ్రీ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, విజయవాడ, ఘటం పై శ్రీ మావుదూరి సూర్య ప్రసాదరావు, ఆముదాలవలస, చక్కటి సహకారాన్ని అందించారు.

కొమ్మిరెడ్డి శ్రీ రామ నరసింగరావు గారు, మాలి శ్రీనివాస చౌదరి గారు జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఎనిమిదవ రోజు కార్యక్రమం చెన్నై వాస్తవ్యులు శ్రీమతి మాళవిక సుందర్, గాత్ర కచేరి రసవంతంగా జరిగింది.

కళ్యాణి వర్ణంతో ప్రారంభించి, నాట రాగంలో త్యాగరాజ స్వామి వారి పంచరత్న కీర్తన జగదానంద కారక, ఖమాస్ రాగంలో బ్రోచేవారెవరురా మొదలైన కీర్తనలు చక్కగా గానం చేసారు. వీరికి వయోలిన్ పై శ్రీ మావుదూరి సత్యనారాయణ శర్మ, ఆముదాలవలస, మృదంగంపై శ్రీ మంగళగిరి శ్రీధర్, నూజివీడు, ఘటం పై శ్రీ మావుదూరి సూర్య ప్రసాదరావు, ఆముదాలవలస, చక్కటి సహకారాన్ని అందించారు.

శ్రీమతి పోతుల సత్య కుమారి గారు,జ్యోతి ప్రజ్వలన చేశారు. తొమ్మిదవ రోజు కార్యక్రమం చెన్నై వాస్తవ్యులు శ్రీమతి పార్వతి రవి ఘంటసాల బృందం, చెన్నై, నాట్య ప్రదర్శన జరిగింది.

వీరు అన్నమాచార్యుల వారి నృత్య రూపకం శ్రీమన్నారాయణ, గోవింద, భావయామి అలరులు కురియగ, బ్రహ్మమొక్కటే మొదలైన సంకీర్తనలకు మరియు కోర్టు సన్నివేశం లో నానాటి బ్రతుకు, నృత్యం ప్రతిభగా ప్రదర్శించారు. మరియు ఘంటసాల వెంకటేశ్వరరావు మాష్టారి గారి దినకరా, రాజశేఖరా, ననుపాలింప, శివశంకరి మొ. అద్భుత గీతాలకు సాంప్రదాయ నృత్యాలతో ప్రదర్శన చేసి ప్రేక్షకులను అబ్బురపరిచారు.

పార్వతి గారి శిష్యులు ప్రియ, హరిణి, పవిత్ర, శ్వేత, కావ్య, గాయత్రి ఈ నృత్య కార్యక్రమం లో వారి ప్రదర్శన తో అలరించారు.

పదవరోజు కార్యక్రమం చెన్నై వాస్తవ్యులు శ్రీమతి జె.బి.కీర్తన, చెన్నై, గాత్ర కచేరి రసవంతంగా జరిగింది. మోహన వర్ణంతో ప్రారంభించి, ధన్యాసి రాగంలో రామ దయజూడవే ; మనోహరి రాగంలో పరితాపము, కాంభోజి లో ఏమయ్య రామ మొదలైన కీర్తనలు చక్కగా గానం చేసారు. వీరికి వయోలిన్ పై శ్రీ ఎమ్. రామ్ చరణ్, విశాఖపట్నం, మృదంగంపై శ్రీ ఎమ్. శ్రీధర్, మోర్సింగ్ పై శ్రీ జి. వెంకటేశ్ గారు, విశాఖ, చక్కటి సహకారాన్ని అందించారు.

డా. ముళ్ళపూడి నాగేశ్వరరావు గారు, డా. ఎస్. వి. రావు గారు జ్యోతి ప్రజ్వలన చేయగా కాకినాడ స్మార్ట్ సిటి ఎమ్. ఎల్. ఏ. ద్వారంపూడి చంద్రశేఖర్ గారు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమం డా ముళ్ళపూడి నాగేశ్వరరావు గారు, ఇంపీరియల్ షిప్పింగ్ కంపెని సౌజన్యంతో జరిగింది.

ఈ కార్యక్రమం అధ్యక్షులు శ్రీ నారాయణం మురళి; కార్యదర్శి శ్రీ వక్కలంక రామకృష్ణ; సభ్యులు సర్వశ్రీ ఎమ్.వి.జి.కృష్ణంరాజు,జి.ఎస్. కృష్ణదేవరాయ వెంకటరావు, ఎన్.మణిబాబు, డా॥ముళ్ళపూడి నాగేశ్వరరావు, శ్రీమతులు చావలి సూర్యకుమారి, ఎమ్.భరతలక్ష్మి, ప్రభల రాజేశ్వరి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. కళాకారుల పరిచయం శ్రీ జి.ఎస్.కృష్ణదేవరాయ వెంకటరావు నిర్వహించారు. స్థానిక సంగీత ప్రియులు విచ్చేసి కళాకారులకు ప్రోత్సాహమిచ్చారు. కార్యదర్శి శ్రీ రామకృష్ణ ఆర్థిక సహకారమందజేసిన వారందరికీ కృతజ్ఞత లు తెలిపారు.




సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు
Sangitha Vidwath Sabha, Kakinada


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు


సంగీత విద్వత్సభ (రి.) కాకినాడ
సంక్రాంతి సంగీత నృత్యోత్సవములు
Sangitha Vidwath Sabha, Kakinada















**ఆనంద మహతి కల్చరల్ అసోసియేషన్**
**హైదరాబాద్ వారి "గురువందనం" కార్యక్రమం**

## పిఠాపురంలో ఘనంగా త్యాగరాజ ఆరాధన మహోత్సవ వేడుకలు

త్యాగరాజ ఆరాధన వేడుకలు పురస్కరించుకుని పిఠాపురం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో త్యాగరాజ విగ్రహం వద్ద సద్గురు శ్రీ త్యాగరాజ సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. అర్చకులు విజయ జనార్దనాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం త్యాగరాజ విగ్రహం వద్ద స్థానిక సంగీత కళాకారులు పలు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. జగదానందకారక, దుడుకుగల, సాధించెనే. కనకనరుచి, ఎందరో మహానుభావుల వంటి కీర్తనలు సంగీత ప్రియులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో శ్రీమతి వింజమూరి గాయత్రి మరియు వారి శిష్య బృందం; పిఠాపురం, విశాఖపట్నం సంగీత జనకులం పిఠాపురం శాఖ శ్రీ ఆకొండి వెంకట్రావు వారి శిష్య బృందం పంచరత్న గానం చేశారు. గట్టి శ్రీకృష్ణదేవరాయ వెంకట్రావు, కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, దేవస్థానం సిబ్బంది, స్థానిక వేద పండితులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు..





# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము గుంటూరు

177వ శ్రీ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవములు గుంటూరు నగరం లక్ష్మీ పురం నందలి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము స్వంతభవనంలో 45 వ సంవత్సరం 2024 సం "జనవరి 25 నుండి 31వ తారీకు వరకు జరిగాయి. 25న గురువారం ఉదయం ఉత్సవమునకు సభాధ్యక్షులు శ్రీ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించిరి.

ముఖ్య అతిధిగా రవాణాశాఖ సంయుక్త కమీషనర్ గౌరవ డాక్టర్ బి. కృష్ణవేణి గారు పాల్గొని తనసందేశాన్ని ఇస్తూ, సమిష్టికృషితో 45 సంవత్సరములుగా సంగీతసభ నడపడమనేది గుంటూరు సంగీత అభిమానులకు ఒక వరముగా అభివర్ణించిరి. ఈ సందర్భంగా వారు సంస్థప్రత్యేక సంచికను ఆవిష్కరించిరి. గానకళావిశేషములను వివరిస్తూ, సంగీతానికి విజ్ఞానమయ, మనోమయ, ఆనందమయ కోశములతో గల సంబంధాన్ని సమన్వయించి శాస్త్రీయ దృక్పధంతో ప్రసంగించిరి. తదనంతరం ఔత్సాహిక విద్యార్థులు మరియు విద్వాంసుల లఘు కచేరీలు జరిగినవి.

సాయంత్రం 6:30కు విద్వాన్ శ్రీ ఏ.ఎస్. మురళి గ గాత్ర సంగీతసభ జరిగింది. దీనికి శ్రీ ఆర్. దినకర్– హైదరాబాద్– వైలిన్ పై, శ్రీ వివి. రమణమూర్తి – విశాఖపట్నం మృదంగం పై, శ్రీ హరిబాబు గుంటూరు ఘటం పై సహకరించారు. తొలుత శ్రీరఘుకుల– హంసధ్వని కీర్తనతో కచేరిని ప్రారంభించి తరువాత రామనిన్నే –హుసేని, అప్పరామ భక్తి– పంతువరాళి, "ఎంతో భక్తి" ఎత్తుగడతో ప్రారంభించి నెరవు, స్వరకల్పనలతో రసరమ్యంగా గానం చేసారు. అపురూపరాగమైన శ్రీమణిలో 'ఏమందునే' కీర్తన, పిమ్మట ఏకైక రాగకృతి ఐన సుప్రదీపం రాగంలో– "వరశిఖివాహన" పాడి, రామానీయెడ – ఖరహరప్రియ రాగం అంశం ప్రధానాంశముగా గానంచేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. శ్రీ రమణ మూర్తి మృదంగంపై సహకరించారు అనటంకంటే మృదంగంతో సహకార గానము చేశారు అనటం సమంజసం. శ్రీ దినకర్ వైయోలిన్ పై తనదైన శైలిలో ధీటుగా స్పందించారు. శ్రీ హరిబాబు చక్కని ఘటసహకారము నందించి కచేరిని రక్తికట్టించారు. మాటలకందని తన్యవార్తనం అనంతరం క్షీరసాగర విహార – ఆనందభైరవి ఇత్యాది కీర్తనలతో తొలిరోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

26–01–24శుక్రవారం ఉదయం 9:15 నిమిషములనుండి మధ్యాహ్నం 1:30 నిమిషములవరకు విద్యార్థినీ విద్యార్థుల లఘు కచేరీలు జరిగినవి. అనంతరం సాయంత్రం 6:30 నిమిషములకు ఎమ్. బి. హరిహరన్, ఎస్. అశోక్ (బెంగుళూరు)గార్ల యుగళ గాన కచేరి జరిగింది. శ్రీ విశ్వేశ్ చంద్రశేఖర్ చెన్నయ్– వయోలిన్ పై, శ్రీ బుర్రా శ్రీరామ్ – చెన్నయ్ మృదంగం పై, శ్రీ ఎమ్. హరిబాబు గుంటూరు ఘటం పై సహకరించారు.

తొలుత నిన్నే భజన – నాట రాగంతో ప్రారంభించి తరువాత సుగుణములే –చక్రవాకం రాగములోనూ, తులశమ్మ – దేవగాంధారి రాగంలో చక్కగా గానం చేశారు. తదనంతరం దేవశ్రీ అను మధ్యమావతి రాగ లాల్గుడి పంచరత్న కీర్తనతో శ్రోతలనలరిపచేసిరి.

తదుపరి అంశముగా, కన్నడ రాగంలో ఆలాపన విశేషంగా, విస్తృతంగా, అత్యద్భుతంగా గానంచేసి రసికులైన శ్రోతలను అబ్బురపరచారు. "నిన్నాడ" కీర్తన, స్వరసంచారాలతో ప్రతిభా వంతంగా గానం చేశారు. అనంతరం మరొక అపురూప రాగకృతి ఐన కల్గునా నీపద నీరద సేవ –పూర్ణ లలిత అను రాగములో గానముచేయడం మరోక విశేషము. "వరదరాజ" అను స్వరభూషణి రాగ రచన శ్రోతలను అలరింప చేసాయి.

తదుపరి అంశముగా కాపీనారాయణి రాగములో సరససామదాన అను రచనను గ్రహించి "చతుర, దాన చతుర, సామదాన చతుర "అని చతురమైన సరసమైన ఎత్తుగడలతో గాన చాతుర్యం ప్రదర్శించారు. ప్రధానాంశంగా ఏతావునరా –కళ్యాణి రాగ కృతిని సర్వాంగ శోభితంగా ప్రదర్శించారు. శ్రీ బుర్రా శ్రీరామ్ మృదంగం పై లయాత్మకంగా సహకరించి శ్రీ బెంగళూరు సోదరుల మెప్పు పొందారు, చిరంజీవి విశ్వేశ్ చంద్రశేఖర్ పిట్టకొంచం కూత ఘనం అన్నట్లు తనవంతు సహకారంని అందించారు. శ్రీ హరిబాబు కూడ దీటుగా స్పందించారు. చక్కని తన్యా వర్తనం అనంతరం శ్రీ రామ శ్రీ రామ – శహన లోను, వరరాగ లయ పాశ్చాత్య వర్ణమెట్టు ననుసరించిన –శంకరాభరణం రాగంలోను కీర్తనలను గానం చేసి మంగళ శ్లోకాలతో కచేరి ముగించారు.

మూడవరోజైన శనివారం 27–1–24 ఉదయం యధావిధిగా లఘు కచేరీలు నిర్వహించారు. విజయవాడ నుండి శ్రీ గందూరి శ్రీనివాస రావు వారి శిష్యబృందం తో వచ్చి వారే వయోలిన్ సహకారం అందించి ఆదర్శ గురుకుల పద్ధతిలో శిష్యుల చేత లఘు కచేరిలు నిర్వహింపచేశారు. సాయంత్రం విద్వాన్ ఎమ్. సుధాకర్ విజయవాడ వారి గాత్ర కచేరి జరిగింది. చిరంజీవి గాయత్రి శివాని వయోలిన్ పై, శ్రీ బుర్రా శ్రీరామ్ మృదంగం పై, శ్రీ హనుమంతరావు ఘటం పై సహకరించారు. శ్రీ సుధాకర్ కచేరిని శ్రీ గణపతిని – సౌరాష్ట్ర రాగంతో ప్రారంభించి తరువాత ఆరభి పంచరత్నం గానం చేశారు. పిమ్మట శోభిల్లు సప్తస్వర –జగన్మోహని లోను, తెలిసి రామచింతన –పూర్ణచంద్రిక లోను గానం చేసి తదుపరి వివాది మేళ మైన నాసికా భూషణి లో మారవైరి రమణి మంజు భాషిణి కృతిని మృదుమధురంగా గానంచేసి, కీర్తనలోని సాహిత్యపు లోతులను స్పృశింపచేస్తూ వివరించి గానంచేశారు. ప్రధానాంశంగా కొలువైయున్నాడే –భైరవి రాగరచనను చిక్కని రాగభావంతో సాహిత్య స్ఫూర్తితో రసరమ్యంగా వినిపించారు. చిరంజీవి గాయత్రి శివాని పెద్ద విద్వాంసులతో దీటైన సహకారంమందించి మూర్తి కొంచెం కీర్తి ఘనం అనిపించింది. శ్రీ బుర్రా శ్రీరామ్, శ్రీ హనుమంతరావు గార్లు వారి సమర్ధతను వారు నిరూపించుకున్నారు.



ఈ ఉత్సవాల సందర్భంగా ప్రముఖ గాత్ర వయొలిన్ విద్వాంసులు శ్రీ గండూరి శ్రీనివాస మూర్తిగారికి సత్కారం జరిగిన దృశ్యం

























తరువాత ఉయ్యాల లూగవయ్యా నీలాంబరి, గంధము పూయరుగా – పున్నాగవరాళి, మధ్యమావతి కీర్తనతో కచేరి ముగిసింది. గానకళా విహంగానికి సంగీత సాహిత్యా లు రెండు రెక్కలు అనుకుంటే ఆరెండింటి మధ్య సమతుల్యత సాధించారు గాన సుధాకరుడు శ్రీ సుధాకర్.

28-1-24 నాల్గవ రోజు ఆదివారం ఉదయం లఘు కచేరిలు జరిగాయి. సాయంత్రం శ్రీ మతి తులసీ విశ్వనాథ్ గారి గాత్ర కచేరి దీనికి శ్రీ పి. నందకుమార్ వయోలిన్ పై శ్రీ పి.విజయభాస్కర్ మృదంగం పై శ్రీ హనుమంతరావు గారు ఘటం పై సహకరించారు. యిది ఒక కుటుంబ కచేరి. వీరు ముగ్గురునూ గుంటూరు వారే, ఒకే కుటుంబం వారు కావడం విశేషం. శ్రీ మతి తులసి విశ్వనాథ్ గారు నిన్నే భజన –నాట రాగంతో కచేరి ప్రారంభించి, నీదయరాదా –వసంతభైరవి, రామా రఘుకుల –కాపీ, తరువాత అనుపమగుణాంబుధి–అఠాణ కీర్తనలు గానంచేసి, తరువాత ధన్యాసి రాగంలో రామాభి రామ తరువాత నిరవధి సుఖదా –ఉదయ రవిచంద్రిక పాడి సింహేంద్ర మధ్యమంలో రాగం –తానం –పల్లవి గానం చేశారు. అనంతరం దశరథ నందన –అహిరి, రఘువీర –హుసేని కృతితో కచేరి ముగిసింది.

సోమవారం ఐదవరోజు 29-1-24, ఉదయం లఘు కచేరిలు ముగించుకొని సాయంత్రం ప్రధాన కచేరిలో శ్రీమతి శాంతలా సుబ్రహ్మణ్యన్ వేణుగానం చేశారు. చిరంజీవి కామాక్షి వయోలిన్ పై శ్రీ పి. జయభాస్కర్ మృదంగం పై సహకారాన్ని అందించారు. శ్రీ మతి శాంతలా సుబ్రహ్మణ్యన్ అంతర్జాతీయ కీర్తి గడించిన వేణుగాన విద్వాంసులైన శ్రీ శశాంక్ గారి సోదరి. వీరు తొలుత రఘునాయక –హంసధ్వని కృతిని స్వరసహితంగా వినిపించారు. తరువాత అప్పరామ భక్తి –పంతువరాళి, అనుపమ గుణాంబుధి– అఠాణ తదుపరి ఎవరురా –మోహన కృతిని స్వరరాగ సహితంగా వినిపించి తరువాతి అంశముగా మోక్షముగలదా –సారమతి రాగ రచన ప్రధానాంశముగా తీసుకొని విస్తృతమైన రాగస్వర సంచారాలతో ఆలపించారు. సారమతి రాగాన్ని ప్రధానంశముగా గ్రహించడం సాహసమే ఐనా సమర్థవంతంగా ప్రదర్శించారు. తదుపరి యమునా కళ్యాణి రాగములో నారాయణహరి గానంచేసి సురటి రాగం మంగళంతో కచేరిని సుసంపన్నం చేశారు.

30-1-2024 ఆరవరోజు సాయంత్రం వర్ధమాన విదుషీమణులు కుమారి లావణ్య చెన్నై, శ్రీమతి పావని పసుమర్తి విజయవాడ గారల గాత్ర కచేరిలు విడివిడిగా జరిగాయి. వీరిరువురికి చిరంజీవి ఏ. కామాక్షి మరియు శ్రీ అర్. శ్రీరామ్మూర్తి హైదరాబాద్ వయోలిన్ – మృదంగాల పై సహకరించారు. తోలుత కుమారి వి. లావణ్య కచేరి జరిగింది. వీరు బ్రోచేవారెవరే –శ్రీరంజని తో ఆరంభించి పంతువరాళి లో “పరమపావన గుణ” అను అరుదైన శ్రీ త్యాగరాజ కృతిని ఆలపించారు. తదుపరి నాదుపై పలికేరు నరులు – మధ్యమావతి, ఆరభి పంచరత్నం పాడి పిదప ప్రధానాంశముగా రాజువెడలె

–తోడి రాగకీర్తన గానం చేసి, హరిదాసులు–యమునాకళ్యాణి అంశం తో ముగించారు. తరువాత కచేరి శ్రీ మతి పావని పసుమర్తి గారిది. వీరు అభీష్టవరద అను హంసధ్వని రాగ కృతి తో ప్రారంభించి తరువాత ఎవరితో నే దెల్పుదు అను వివాది మేళమైన మానవతి రాగంలోని కృతి గానంచేశారు. పిమ్మట భజ భజ –కన్నడ రాగ రచన, ఆపై శంభో మహాదేవ పంతువరాళి రాగకృతిని ప్రధానాంశముగా ఎంచుకొని సమర్ధవంతంగా గానంచేశారు. తదుపరి అఠాణ రాగంలో అనుపమ గుణాంబుధి కృతి పాడి, ఎంతముద్దో – బిందుమాలిని రాగంలో శ్రావ్యంగా వినిపించారు. సరస సామదాన కాపీనారాయణి పాడి అనంతరం శ్రీ రాగంలో నామకుసుమముల కృతితో కచేరి ముగించారు. ఈ రెండు కచేరిలకు చిరంజీవి ఎ. కామక్షి శ్రీ బి. శ్రీరామమూర్తి వారి వాద్య సహకారంతో మరింత శోభను చేకూర్చారు.

ఇక చివరిరోజైన ఏడవరోజు 31–01–2024 బుధవారం ఉదయం 9:30 నిమిషములకు శ్రీ త్యాగరాజ స్వామికి అభిషేకం అర్చనాదులు జరుగుచుండగా మరోక చెంప స్వామి వారిని పల్లకిలో ఊరేగింపు నగరోత్సవం నిర్వహించారు. నాట్యాచార్యులు శ్రీ కాజ సుబ్రహ్మణ్యం శ్రీ త్యాగరాజ వేషములో ఉంఛవృత్తి చేశారు. అనంతరం పంచరత్న సేవ, ప్రసాదవితరణ తో ఉదయం కార్యక్రమాలు ముగించుకొని మరలా సాయంత్రం 6:30 నిమిషములకు శ్రీ బి. సురేష్ బాబు ఆధ్వర్యంలో వారి శిష్య బృందంచే వారు రూపొందించిన శ్రీ త్యాగరాజ కృత "నౌకా చరిత్రం" నృత్య రూపకం వీనులవిందైన కీర్తనలతో నయనానందకరమైన నృత్య ప్రదర్శనతో రస రమ్యంగా సాగింది. ఆహ్వానితులైన అశేషజన సమూహాన్ని అలరింప చేసింది. శ్రీ లలితా పీఠం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ శ్రీ మేళ్ళ చెరువు సుబ్రహ్మణ్య శర్మ గారు ముఖ్య అతిధిగా విచ్చేసి వారి అనుగ్రహ భాషణానంతరం చిరంజీవులను ఆశీర్వదించారు. తరువాత ఆంజనేయత్సవంతో ఉత్సవములు జయప్రదముగా ముగిశాయి.

పై కార్యక్రమములన్నీ సంఘసలహాదారు శ్రీ నేతి విశ్వేశ్వరరావు సారధ్యంలో అధ్యక్షులు శ్రీ రామరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్. గిరిజాశంకర్ ల ఆద్వర్యంలో సెక్రటరీ శ్రీ వి. కృష్ణకిశోర్ నేత్రుత్వంలో ఇతర సంఘ సభ్యుల దాతల సహకారంతో దిగ్విజయంగా జరుపబడినవి.






# విశ్వనాథ సాహిత్య అకాడమీ, గుంటూరు



03-02-2024న గుంటూరులో అన్నమయ్య కళావేదికపై పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభాని - పద్మశ్రీ శ్రీమతి కాలేషాబి మహబూబ్ (సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు - శ్రీరంగం) గారలకు 'విద్యాసుందరి' బెంగుళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం అందించిన దృశ్యం. ముఖ్య అతిథి శ్రీ వాసిరెడ్డి వద్యాసాగర్.



04-02-2024న వివిఐటి, నంబూరు, గుంటూరు జిల్లాలో తరంగ భజనగాన పండితులు శ్రీ గోరకవి సంపత్ కుమార్ ను విశ్వనాధ సంస్కృతీ పురస్కారంతో సత్కరించిన దృశ్యం. ఈ అవార్డులు సన్మిత్రులు కీ॥శే॥ జె. వెంకటేశ్వరరావు ఆకాంక్షపై ప్రతివత్సరం అందిస్తున్నారు. నిర్వాహకులు డా॥ మద్దినేని సింహకౌటిల్య చౌదరి, మోదుగుల రామకృష్ణ, శెట్లెం చంద్రమోహన్ తదితర సహృదయులు.

## సంగీతం నాకు మానసిక ఆనందం కలిగిస్తుంది.



నా పేరు వి.వి.ఎల్.ఎన్.శాస్త్రి. నేను నా ఏడవ ఏట నుంచి సంగీతం వింటున్నాను. మా అక్క వయొలిన్ నేర్చుకునేది. 1956 లో రేడియో కొన్నాము. శాస్త్రీయ సంగీతం, పిల్లల ప్రోగ్రామ్ వినేవాడిని. ఇప్పుడు కూడా రోజూ రేడియో వింటాను, శాస్త్రీయ, సంగీతం, లలిత సంగీతం. పది సంవత్సరాల వయస్సులో మేముబందరులో వుండే వారము. ఆ వూరి ఆలయంలో హరికథ కు మా పెద్దమ్మ గారు తీసుకు వెళ్ళేవారు. అలా ప్రత్యక్షంగా సంగీత శ్రోతగా మారాను. తెలియకుండానే. పిల్లలమర్రి రామదాసు భాగవతార్ గారు ఆయనపేరు. ఆ కథా రీతి ప్రత్యేకం.ఓ రోజు శృతిపెట్టె వాయించే వారు రాక ఎవరైనా ముందుకొస్తారా? అని అడిగారు. నేను ముందుకు ఉరికాను.నిజానికి ఏమీతెలియదు. ఒకసారి మెల్లగా ఒకసారి వేగంగా వాయించాను. అలా వాయించడం వల్ల శృతిలో తేడా వస్తుందేమొ కూడా తెలియదు. దాసుగారు ఎలా భరించారో! 1962 నుండి కాకినాడ సూర్యకళా మందిరం లో కార్య క్రమాలు వింటున్నాను. ఒకసారి మునుగంటి శ్రీరామ మూర్తి గారు నన్ను కమిటెడ్ శ్రోత అని అభినందించారు. వారికి నమోవాకాలు. ఆ సంఘటన నన్ను మరింతగా సంగీతంలో పడేసింది.

# సంస్కృతీ ఫౌండేషన్-హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం.

## 24.1.2024 నుండి28.1.2024 వరకు,శిల్పారామంలో...జరిగాయి.ఆ కచేరీల దృశ్యమాలిక.





















28.2.24 న మోదుమూడి సుధాకర్ గానం.
శివాని;ఫల్గుణ్;ఫణిభూషణ్ గారలు సహకారాలు.






శిల్పారామం


శిల్పారామం


శిల్పారామం


శిల్పారామం


శిల్పారామం


శిల్పారామం


శిల్పారామం



# గాయత్రి మహిళా సంగీత సన్మండలి

## సంగీత జగద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 177వ ఆరాధన సంగీత మహోత్సవములు

ఫిబ్రవరి 3,4,5 – 2024, త్యాగరాజ మందిరం, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు





















# ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం





**ఘనంగా పురందర దాసుల ఆరాధన.........**

విజయనగరం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, ఉత్తరాది మఠం మరియు రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడెమీలలో కర్ణాటక సంగీత పితామహులు శ్రీ పురందర దాసుల వారి ఆరాధన, దివ్యస్మరణోత్సవం 9.2.2024 శుక్రవారం పుష్య బహుళ అమావాస్య నాడుఘనంగా జరిగింది. ఉదయం 10.30కి అర్చకులు రాజేష్ కుల్కర్ణీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం కొత్తపల్లి సుబ్బారావు బృందం నిర్వహణలో వేణుగోపాలస్వామి ఉత్తరాది మఠంలో సంగీత ఆరాధన జరిగింది. సాయంత్రం 5.30కి రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడెమీలో అధ్యాపకులు హారిక, నిర్మల, మహేశ్వర రావు, భానుహర్ష, వంశీకృష్ణ, రవికుమార్ ఆధ్వర్యంలో, విద్యార్థులచే దేవరనామాల కచేరీలు జరిగాయి. అనంతరం సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు కొత్తపేట మండపం వద్ద గల ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో కార్యదర్శి డాక్టర్ మండపాక రవి నిర్వహణలో స్థానిక విద్వాంసులు, సంగీత సంస్థలు, విద్యార్థుల కచేరీలు జరిగాయి. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వోలేటి శైలజ నిర్వహణలో బాగా కచేరీలు చేశారు. ఈశ్వరమ్మ వయోలిన్ పైన, శివకుమార్ మృదంగం పై చక్కని సహకారాన్ని అందించారు. ముఖ్యఅతిథిగా ఉత్తరాది మఠం అధికారి రఘూత్తమాచార్యులు విచ్చేసి పురందర దాసుల జీవిత చరిత్రలో కొన్ని ఘట్టాలని, సంగీతానికి ఆయన చేసిన కృషిని విశదీకరిస్తూ ఇప్పుడు సంగీతం నేర్చుకుంటున్న వారికి ఆయన ఎలా దిశానిర్దేశం చేశారో తెలియజేసారు. సంస్థ భవనం ప్రథమ వార్షికోత్సవం కూడా 9వ తేదీ కావడంతో పలువురు ప్రముఖులు డాక్టర్ ఎ. గోపాలరావు, డాక్టర్ అయ్యగారి రాఘవరావు, మహేశ్వర రావు, సన్యాసిరావు, ప్రముఖ మృదంగ విద్వాంసులు వి.అప్పలస్వామి సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు ముఖ్యఅతిథిని, విద్వాంసులను సత్కరించారు.





# సంగీత లహరి, రాజమండ్రి

## సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాల సంగీత కార్యక్రమాల చిత్రమాలక


























సంగీత లహరి
సాంస్కృతిక సేవా సమితి
సంగీత లహరి
ఆరాధనోత్సవములు












సంగీత లహరి
సంగీత లహరి
సాంస్కృతిక సేవా సమితి
ఆరాధనోత్సవములు









అయోధ్య రామ ప్రతిష్ఠ సందర్భంగా తెలుగునాడు నుండి
ఘటంపైపాల్గొన్న శ్రీ సరస్వతుల హనుమంతరావు
ను కాకినాడ సంగీత విద్వత్సభలో సత్కరిస్తున్న
వీణవిద్వాంసులు శ్రీ నగేశ్ బాబు.



27-1-2024 న శ్రీ పంపన దయానంద బాబు
ఆధ్వర్యంలో కాకినాడలోని ఘంటసాల వారి విగ్రహం వద్ద
నివాళులర్పిస్తున్న వారి కోడలు నాట్యవిద్వాంసురాలు
శ్రీమతి పార్వతి.



వాగ్గేయకారమండపం, సర్పవరంలో
త్యాగరాజ ఆరాధన సందర్భంగా పంచరత్నసేవ.
విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో



వాగ్గేయకార మండపం, సర్పవరం, కాకినాడ లో జరిగిన
త్యాగరాజ ఆరాధన లో స్వామివారి జీవిత విశేషాలపై
ప్రసంగించిన విద్వాన్ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు.




కాకినాడ సరస్వతీగానసభ ఆధ్వర్యంలో జరిగిన పంచరత్న సేవ.

# భక్తరామదాసు జయన్తి మహోత్సవం, నేలకొండపల్లి

















ఫిబ్రవరి 5 వ తేదీని Dr త్యాగరాజు మరియు శిష్య బృందం చే విశాఖ స్టీల్ ప్లాంట్ లో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనా మహోత్సవం.
విద్వాన్ శ్రీ హెచ్. రామచరణ్ – వయోలిన్ మరియు శ్రీ T. చైతన్య మృదంగం పై సహకారం అందించారు.



సంగీత క్షీరసాగరం–సప్తపర్ణి, హైదరాబాద్ వారి 626వ సంగీత కార్యక్రమం హోప్ టివి ప్రత్యక్ష ప్రసారం గా10.2.2024 న విద్వాన్ శ్రీ మొదలి మురళీకృష్ణ గాత్రసభ
శ్రీ కొమాండూరి శౌరిరాజన్– వైలన్;
శ్రీ మొదలి కృష్ణసాయి– మృదంగం;
శ్రీ మామిళ్ళపల్లి చంద్రకాంత్– ఘటం సహకారంతో జరిగింది.



భక్తిశ్రద్ధలతో రామదాస 361వ జయంతి

విజయనగరం రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడెమీలో భద్రాచల రామదాసుల వారి 361వ జయంతి భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, రామదాసు జీవిత విశేషాలు విద్యార్థులకు తెలియజేసి వారికీర్తనలు కొన్ని ఆలపించి ప్రతీ విద్యార్థి వారి కీర్తనలు తెలుసుకొని నేర్చుకొని పాడాలని తెలియజేసారు. అధ్యాపకులు , నిర్మల, మహేశ్వర రావు, భానుహర్ష, రవికుమార్, బాలాజిస్వామి, పాల్గొన్నారు.




త్యాగరాజ ఆరాధన సందర్భంగా తిరుపతి లో రాగరసజ్ఞ సంగీత సభ ఆధ్వర్యంలో "సొగసుగా మృదంగ తాళము " శీర్షికన జరిగిన కమలాకర యోగీశ్ మృదంగ లయవిన్యాసం. చి. సంకీర్త్ వయొలిన్ తో, సరస్వతుల హనుమంతరావు గారు ఘటం తో సహకరించారు.



వరంగల్లు, విద్యారణ్య ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల లో త్యాగరాజ ఆరాధన సందర్భంగా పంచరత్న సేవ.





శ్రీపద్మావతీ మహిళాయూనివర్శిటీ – తిరుపతి సంగీత నాట్య లలితాకళా విభాగంలో త్యాగరాజ కృతుల యందలి సంగీత సాహిత్య సమన్వయంతో పై ప్రసంగించిన విద్వాన్ శ్రీ వైజర్స బాల సుబ్రహ్మణ్యం. వారిని సత్కరిస్తున్న విభాగాధిపతి విదుషి ప్రొ॥శ్రీమతి ఓరుగంటి ఆర్.నాగశైలేశ్వరి.

# శ్రీరామ గానసభ, హైదరాబాదు ఆధ్వర్యంలో "సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు

కొత్త నల్లకుంట, రామాలయంలో 03-02-2024 నుండి 11-02-2024 వరకు ఘనంగా జరిగాయి.

03-02-2024 శనివారము మొదటి రోజున డా. అనంతలక్ష్మి గారిచే అయోధ్య రామునిపై చక్కటి ప్రసంగం చేశారు. అందులో రామాయణంలోని కొన్ని సంఘటలను వుటంకిస్తు, మానవ జీవితంలో పాటించవలసిన సంఘటనలను వివరించారు. ప్రసంగం శ్రోతలను ఆకట్టుకొన్నది.

తరువాత శ్రీయుతులు చేబియ్యం రామకృష్ణ (రిటైర్డ్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్) గారిచే ప్రారంభోత్సవం మరియు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇందులో కార్మదర్శి కొణికి శ్రీనివాస శర్మ, లలితా శ్రీనివాస్, పి. రామారావు, తిరుమల రావు, జ్యోతి, ధనలక్ష్మి గార్లు పాల్గొన్నారు.

అనంతరం శ్రీమతి అచలా శంకరనాథ్ వీణా వాదనం చేశారు. ఇందులో మనవి ఆలకింపరాదటే, సామజవరగమన ముఖ్యంగా జ్ఞానమొసగరాదా, పూర్వీకళ్యాణీలో రాగం, తానం, పల్లవి, నెఱవు స్వరకల్పన చేసి ప్రేక్షకులను అలరించారు. మృదంగం పై విద్యాసాగర్ మరియు యం. చంద్రకాంత్ ఘటంపై చక్కటితని అవృతం వినిపించి, శ్రోతలను అలరించారు.

04-02-2024 ఆదివారం : రెండవ రోజున "కచ్ఛపి" సంగీత అకాడమి (పాతబస్తి) హైదరాబాదు వాసి శ్రీ కె. శ్యాంకుమార్ శిష్యులు మొదటగా గానము చేసారు.

కొన్ని దివ్యనామ సంకీర్తనలను ఆలపించి అందరిని అలరించారు. వీరికి టి.పి. బాలు మృదంగంపై, ఎన్.సి. అనంతకృష్ణ వయోలిన్ పై సహకరించారు.

తరువాత శ్రీ కె. శ్యాంకుమార్ గానకచేరి జరిగినది. వీరు గానం చేసిన కృతులలో "తులసీ దళములచే", రామా కోదండరామా కొన్ని కృతులలో రాగాలాపన, నెరవు, చక్కటి మనోధర్మంతో స్వర కల్పనలు చేసి అందరిని అలరించారు.

వీరికి, వయోలిన్ పై శ్రీ ఎన్.సి. అనంతకృష్ణ, మృదంగంపై డా. ఆర్. శ్రీకాంత్, మరియు ఘటంపై శ్రీ టి.పి.బలసుబ్రహ్మణ్యన్ ఆద్యంతం చక్కటి సహకారం అందించి కచేరిని సంపన్నం చేశారు.

05-02-2024 : సోమవారం మూడవ రోజున శ్రీ నేంద్రగంటి అలమేలుమంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్టు వారి బృందంలో శ్రీ నేంద్రగంటి కృష్ణమోహన్ కొన్ని రామదాసు కీర్తనలు గానం చేసి అలరించారు.

తరువాత ఇతర కళాకారులు గానం చేశారు. అందులో శ్రీమతి కపిలవాయి లలిత గానం చేశారు. అందులో "శ్రీరామ చూర్ణిక" చక్కగా కొత్తదనంతో అందరిని ఆకట్టుకున్నది. వీరికి వయోలిన్ పై శివకష్ణ స్వరూప్, మృదంగంపై చంద్రకాంత్ చక్కటి సహకారం అందించారు.

అనంతరం శ్రీ ఎ. కృష్ణ స్వరూప్ మరియు

కపిలవాయి శశాంక్ వయోలిన్ ద్వయం అందరిని అలరించినది. వీరికి మృదంగంపై సి.హెచ్. రామకృష్ణ, ఘటంపై చంద్రకాంత్, తబలాపై గుణరంజన్ సహకరించారు. సభా కార్యదర్శి శ్రీ కొణికి శ్రీనివాస శర్మ కళాకారులను అభినందిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు.

06-02-2024 మంగళవారం నాల్గవ రోజున మొదటిగా శ్రీమతి గుడిపాటి భాగ్యలక్ష్మి మరియు శ్రీమతి చివుకుల మాధవి గార్ల శిష్యులు గానం చేశారు. చక్కటి విద్య ప్రదర్శించారు. వీరికి మృదంగంపై వెంకటేశ్ మరియు శ్రీమతి ఫణిబాల వయోలిన్ పై సహకరించారు.

అనంతరం భాగ్యలక్ష్మి, మరియు మాధవి గార్లు విడివిడిగా గానం చేశారు. వీరి గానం అందరిని అలరించినది. కొన్ని సంవత్సరాల పాటు విద్యని అభ్యసించి పలు శిష్యులను తయారు చేయడం చాలా విశేషమైనదిని కొణికి వారు కొనియాడారు

అనంతరం రెండవ కచేరి డా. శివప్రసాద్ (విజిల్ విజార్డ్) వారిచే ఈలపాట కచేరీ జరిగినది. వీరికి వయోలిన్పై శ్రీ రామరాజు దినకర్ మరియు శ్రీ పెరవలి జయభాస్కర్ మృదంగంపై మరియు ఘటంపై టి.పి. బాలు మరియు క్యాసియోపై విఠల్, వీణపై లక్ష్మి గార్లు సహకరించారు.

07-02-2024 బుధవారము అయిదవ రోజున మొదటిగా శ్రీ ఎస్.కె. నాగుర్‌బాబు – వేణువు మరియు ఆర్. సుధాకర్ వీణ యుగలకచేరితో రక్తి కట్టించారు. వీరికి మృదంగంపై శ్రీ దుర్గా కుమార్, మరియు తబలాపై గుణరంజన్ సహకరించారు.

అనంతరం శ్రీమతి రాధా పద్మనాభన్ గానం చేశారు. వీరికి మృదంగంపై శ్రీ పి. శ్రీనివాస్ గోపాలన్ మరియు వయోలిన్ పై కె. అనంత శౌరిరాజన్ సహకరించారు. వీరు తన 40 ఏళ్ళ అనుభవాన్ని మరియు తన మనోధర్మంతో చక్కని కచేరీతో సుసంపన్నం చేశారు.

08-02-2024 గురువారము, ఆరవ రోజున మొదటగా శ్రీ విష్ణు చంద్రశేఖరన్ గానం చేశారు. వీరికి మృదంగంపై శ్రీ టి.పి. బాలు, మరియు వయోలిన్ శ్రీ ఎన్.సి. అనంతకృష్ణ చక్కటి సహకారం చేశారు. సభాకార్యదర్శి మాట్లాడుతు విష్ణు భవిష్యత్తులో మంచి కళాకారుడిగా రాణిస్తాడని అన్నారు.

అనంతరం రెండవ కచేరి శ్రీయుతులు ఆర్.వి. పాండురంగశర్మ గానం చేశారు. వీరు పురాణం వారి శిష్యులు. వీరి గానంలో చెంబై, వారి సాంప్రదాయం బాగా వుట్టిపడినది. వీరికి మృదంగంపై సిహెచ్. రామకృష్ణ, ఘటంపై టి.పి. బాలు, కంజీర పై డా. ఆర్. శ్రీకాంత్ చక్కటి లయ విన్యాసం ప్రదర్శించి కచేరి రక్తి కట్టించారు.

09-02-2024, శుక్రవారం, ఏడవరోజున మొదటిగా శ్రీ సలున్ జోషి గానం చేశారు. వీరు వాసా గోపినాధ్ గారి శిష్యులు. చక్కటి కచేరీ చేశారు. మంచి ఆర్తితో గానం చేశారు.

వీరికి మృదంగంపై కె. వీరాస్వామి మరియు వయోలిన్ పై శ్రీ కొండపల్లి శ్రీనివాస్ సహకరించారు.




Family Members
శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA


Late KARPAGAM RANGA CHARY
FAMILY MEMBERS
శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA


శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA


శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA


SRI RAMA GANA


శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA




శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA


శ్రీ రామ గాన సభ
SRI RAMA GANA SABHA

అనంతరం రెండవ కచేరీలో శ్రీమల్లెల క్రాంతి స్వరూప్ గానం చేశారు. ''ఎంత ముద్దో, ఎంత సొగసో'' కీర్తన అందరిని అలరించినది.

వీరికి వయోలిన్ పై కోలంక శాయి కుమార్, మృదంగంపై పి. శ్రీనివాస్ గోపాలన్, ఘటంపై శ్రీధరాచారి, ముఖశంకుపై శ్రీ కె. వీరాస్వామి చక్కటి సహకారం చేశారు. ఇతని స్వరకల్పనలు, నెఱవులుతో చక్కటి విద్యా ప్రదర్శించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని సభాకార్యదర్శి అన్నారు.

10-02-2024 శనివారము, ఎనిమిదవ రోజున మొదటిగా కుమారి పెరవలి లక్ష్మీజయతి, నాగలక్ష్మి యుగళగానం చేశారు. వీరికి మృదంగంపై శ్రీ విద్యాసాగర్, వయోలిన్పై శ్రీ కె.ఎల్.ఎన్. మూర్తి సహకరించారు.

అనంతరం శ్రీ పెరవలి జయ భాస్కర్ ఆధ్వర్యంలో ''స్వరలయ సుధ'' వాద్య సమ్మేళనం అందరిని అలరించింది.

ఇందులో శ్రీ పెరవలి జయభాస్కర్ మృదంగం, వయోలిన్ లపై నందకుమార్, ఘటంపై మల్లికార్జున్, ముఖశంకుపై వీరాస్వామి, తబలాపై మురళీ గారు మరియు సితార పై నందకుమార్ సహకరించారు. సభా కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ కళాకారులందరిని కొనియాడారు.

10-02-2024 ఆదివారం, తొమ్మిదవ రోజున ఉదయం త్యాగరాజు స్వామి వారి పూజలో కార్యక్రమము మొదలు పెట్టి, అనంతరం శ్రీ ఆర్. వి. పాండురంగ శర్మ భాగవతార్ గారిచే ఆలయ ప్రాంగణంలో ఉంఛ వృత్తి గావించారు. వారికి శ్రీకొణికి లలితా శ్రీనివాస్ గారలు పాదపూజ చేశారు.

అనంతరం శ్రీ డి.వి. మోహన కృష్ణ పాండురంగశర్మ, కె. శ్యాంకుమార, వాసా గోపినాధ గార్లు ఇతర కళాకారులచే పంచరత్న కీర్తనల గోష్ఠి గానం జరిగింది. వీరికి, జయభాస్కర్, పి. శ్రీనివాస గోపాలన్, మృదంగంపై శ్రీ దుర్గా కామర్ ముఖశంకుపై సహకరించారు.

వయోలిన్ పై శ్రీ భాగవతుల సీతాపతిరావు, మరియు కె.ఎల్.ఎన్. మూర్తి వేణువుపై శ్రీ శివరాం గార్లు సహకరించారు.

అనంతరం సుమారు ఆరు వందల మందికి మహా ప్రసాద వితరణ జరిగింది.

10-02-2024 ఆదివారము సాయంత్రం ''కంభంపాటి'' సోదరులు శ్రీకృష్ణ ఆదిత్య – శ్రీ కృష్ణ శశాంక్ గార్లచే ''సంక్షిప్త సుందరకాండ'' గాన సహిత ప్రవచనం జరిగింది.

ఇందులో వారు మంచి కీర్తనలను గానం చేస్తూ ''వుండేది రాముడొకడే'' అనే త్యాగరాజ స్వామి కీర్తన ఆలపించి దీనికి సుందరకాండకి కొన్ని సంఘటనలను వివరించి శ్రోతలను అలరించారు. రామ భజనతో కార్యక్రమము ముగిసింది. దీనికి మృదంగంపై శ్రీకొణికి శ్రీనివాస శర్మ సహకరించారు.

చివరగా ఆంజనేయ స్తుతి మంగళహారతి, స్వస్తి వాచకంతో ఉత్సవాలు ముగిసాయి.

# అలరించిన 'అన్నమయ్య సంకీర్తన మాధుర్యం' భక్తి సంగీత కార్యక్రమము



పవిత్ర మాఘ మాసాన్ని పురస్కరించుకుని, శ్రీ మహావిష్ణువు స్మరణలో స్థానిక నల్లకుంట, హైద్రాబాదు శ్రీ శృంగేరి శంకరమఠం ప్రాంగణము లో అన్నమయ్య పరివారము, ఎస్. పి. నగర్, మౌలాలి, హైదరాబాద్ వారి నిర్వహణలో, శ్రీ శృంగేరి శంకరమఠం వారి సౌజన్యంతో ది. 25-02-2024 ఆదివారమునాడు ''అన్నమయ్య సంకీర్తన మాధుర్యం'' భక్తి సంగీత కార్యక్రమము ఆసాంతము కన్నుల పండువగా జరిగినది.

ఆనాటి కార్యక్రమము ముందుగా అన్నమయ్య పరివారము మార్గదర్శకులు శ్రీ కందుకూరి వెంకట సుబ్రహ్మణ్యం తొలిపలుకులతో, కళాకారుల పరిచయముతో మరియు స్వామివారికీ, ఉభయ దేవేరులకు పుష్పార్చనలతో ప్రారంభమయినది.

'అన్నమయ్య సంకీర్తన చూడామణి' శ్రీమతి ఎన్. సి. శ్రీదేవి (తిరుపతి) తమ గళములో శ్రీ శంకరమఠంలో క్షేత్రపాలకులైన విఘ్నేషుని 'నివాళించెదము' (హంసధ్వని రాగం), శారదాదేవిని 'శంకర పూజితే శారదే' (సారమతి) మరియు శంకరుని 'భో శంభో శివ శంభో స్వయంభో' (రేవతి) కీర్తనలు స్తుతిస్తూ ప్రారంభము చేసినారు. తదుపరి శ్రీమతి శ్రీదేవి తమ మధురగానాన్ని 'శ్రీమన్నారాయణ' (భౌళి), 'దేవా నమో దేవా'(హంసధ్వని), 'భక్తి కొలది వాడే పరమాత్ముడు' (మాలయమారుతం), 'ఏమని పొగడవచ్చు' (హిందోళ); 'శ్రీరంగపతి' (అభోగి), 'ఇట్టివాని నన్ను' (సుమనేశరంజని), 'కొమ్మా నీ చక్కదనము' (కాపి), 'మూసిన ముత్యానకేలే' (మోహన (మ)), 'ఏమని పొగడుదుమే' (అభేరి), రాముడీతడు లోకాభిరాముడీతడు' (హరికాంభోజి), త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాడు' (మాధ్యమావతి) 'వెన్నముద్ద కృష్ణుడు' (దేశాక్షి), 'ఇదివో సుద్దులు' (మోహన (మ)), 'సందెకాడ పుట్టినట్టి ఛాయల పంట' (పంతువరాళి), ''చూడరమ్మ సతులాల' (మధ్యమావతి) వంటి ఆణిముత్యాలైన సంకీర్తనలతో రసజ్ఞులైన శ్రోతలను ముగ్ధులను చేసారు. మరొక వర్ధమాన గాయని శ్రీమతి స్నేహాంకిత ఆలపించిన 'అంతయు నీవే హరిపుండరీకాక్ష'(హిందోళ),'ఇందరికిఅభయమ్ము లిచ్చుచేయి' (మిశ్రహరికాంభోజి), 'తెలిసితే మోక్షము తెలియకున్న బంధము' (రేవతి) కీర్తనలు గానముచేసి స్వామి భక్తులను ఆకట్టుకొన్నారు. చివరగా శ్రీమతి శ్రీదేవి గానముచేసిన 'క్షీరాబ్ధి కన్యకకు' సంకీర్తనతో స్వామివారికి, ఉభయ దేవేరులకు మంగళ నీరాజనాలు అర్పించటంతో కార్యక్రమము ఘనముగా ముగిసినది.

తిరుపతి అన్నమయ్య ప్రాజెక్ట్ కాళాకారులు సర్వశ్రీ ఎన్. బాలాజీ (కీబోర్డ్), పి. పాండురంగారావు (తబలా), పి. సురేష్ (రిథమ్స్) చక్కటి వాద్య సహకారమును అందించి శ్రోతల ప్రశంసలను అందుకొన్నారు.

అన్నమయ్య పరివారము వ్యవస్థాపకులు యనమంద్ర వెంకట కృష్ణయ్య, సభ్యులు కందుకూరి సుబ్రహ్మణ్యం, వై. పురంధర్, కాందూరి శ్రీలక్ష్మి, కె. ఎన్. సంగీత; శంకరమఠం శాఖాధిపతి కె. కృష్ణారావు; వద్వాన్ నల్లాన్ చక్రవర్తి మూర్తి, సీనియర్ పాత్రికేయులు జి. వల్లీశ్వర్ తదితరులు ఈ భక్తి సంగీత కార్యక్రమములో పాల్గొని చివరలో కళాకారులను ఘనముగా సత్కరించారు.

**- శారద గండూరి**

# ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవం





ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవం 25 నుండి 29 వరకు స్థానిక కొత్తపేట మండపం దరి ఆర్యసోమయాజుల కాశీపతి రావు స్మారక భవనంలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. విశాఖపట్నం నకు చెందిన ప్రఖ్యాత గాత్ర విద్వాంసురాలు వీరఘంట లలితా చంద్రశేఖర్ దంపతులకి సంస్థ ప్రతిష్టాత్మక బిరుదు సంగీత కళామిత్ర తో సత్కరించింది. ముందు ఆమె కచేరీ చేయగా హనుమంతు రామచరణ్ వయొలిన్ పైన మహాదాసు ఏడుకొండలు మృదంగంపై సహకారాన్ని అందించారు. అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ముఖ్యఅతిథిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఇ.ఆర్.సోమయాజులు హాజరవ్వగా ప్రియాతిది పువ్వాడ ట్రస్ట్ చైర్మన్ శ్రీహరి హాజరయ్యి వారి వారి సందేశాలను తెలియజేశారు. కార్యదర్శి డాక్టర్ మందపాక రవి సభని నిర్వహించారు. సంస్థ సభ్యులు పద్మప్రియ, సుబ్బారావు, కోశాధికారి సుధాకర్, డాక్టర్ అయ్యగారి రాఘవరావు తదితరులు, సంగీతా భిమానులు, శ్రోతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**దిగ్విజయంగా ముగిసిన ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవం...**

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం 66వ వార్షోత్సవం ఈనెల 25 నుండి 27వరకు స్థానిక కొత్తపేటలో గల సంస్థ కార్యాలయం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో దిగ్విజయంగా మంగళవారం సాయంత్రం రేపల్లె రవికుమార్ సంగీత దర్శకత్వంలో జరిగిన లలితసంగీత విభావరితో దిగ్విజయంగా ముగిసింది. 25వ తేదీ ఆదివారం నాడు విశాఖకు చెందిన ప్రముఖ విద్వాంసురాలు వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్రకచేరీకి రామచరణ్ వయొలిన్ పై, ఎం.ఏడుకొండలు మృదంగం పై సహకారం అందించారు. అనంతరం ఆమెకు సంస్థ ప్రతిసంవత్సరం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న "సంగీత కళామిత్ర" బిరుదుతో సత్కారం ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈ.ఆర్.సోమయాజులు, పువ్వాడ శ్రీహరి, అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కోశాధికారి దన్నాడ సుధాకర్, సభ్యులు, సంగీతాభిమానుల మధ్య జరిగింది. 2వ రోజు భగవతి నృత్య కళామందిర్ విద్యార్థులచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు వడ్లమాని రమణ కుమారి దర్శకత్వంలో అత్యద్భుతంగా జరిగింది. 3వ రోజు మంగళవారం రేపల్లె రవికుమార్ దర్శకత్వంలో లలిత సంగీత విభావరి హృద్యంగా జరిగింది. హారిక శివరాం, లలిత కుమారి, రామరత్నం, సాయిసంపత్, సంగీత కుమార్ చక్కని లలిత గీతాలు ఆలపించారు. తబల పై చక్రపాణి సహకారం అందించారు. భైరవభట్ల అన్నపూర్ణ కార్యక్రమాన్ని సమర్పించారు. మహేశ్వర రావు, విజయాదిత్య, అబ్బులు, శారద, కళాకారులను సత్కరించారు. శ్రోతలు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు...... డాక్టర్ మండపాక – కార్యదర్శి, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం



# కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాలు

## రాధ రాజారెడ్డి దంపతులకు అకాడమీ రత్న పురస్కారం

ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ 2022, 2023 సంవవత్సరాలకు అకాడమీ రత్న ఫెలోషిప్, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు, బిస్మిల్లాఖాన్ యువ ప్రతిభ అవార్డులు ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 16 మంది కళాకారులకు పురస్కారాలు లభించాయి. ఫెలోషిప్ అకాడమీ రత్న పురస్కారం విఖ్యాత కూచిపూడి నాట్య గురువులు పద్మభూషణ్ రాధ రాజారెడ్డి దంపతులకు లభించింది. ఈ పురస్కారం కింద మూడు లక్షల రూపాయలు నగదు, తామ్రపత్రం అందిస్తారు.

2022వ సంవత్సరానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాలు ప్రముఖ నాట్య గురువులు మంజుల రామస్వామి (భరతనాట్యం), డా. భాగవతుల సేతురామ్ (కూచిపూడి), శ్రీమతి మండా సుధారాణి(విశాఖ) (సంగీతం), ఉస్మాన్ మీర్ (సృజనాత్మక ప్రయోగ సంగీతం) లకు లభించాయి.

2023వ సంవత్సరానికి ప్రముఖ నాట్య గురు డా. మద్దాలి ఉషా గాయత్రి (కూచిపూడి), ఎల్. వి. గంగాధర్ శాస్త్రి (భక్తి సంగీతం), పేరిణి ప్రకాష్ (పేరిణి నాట్యం) లకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డులు ప్రకటించారు. నాటక రంగం నుంచి రాజీవ్ వర్మ, మేకప్ రంగం నుంచి బి. మల్లికార్జునరావు(కాకినాడ) లకు లభించాయి. ఈ అవార్డు కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయలు నగదు, తామ్రపత్రం బహూకరిస్తారు.

బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలను 2022వ సంవత్సరానికి గాత్రం లో శ్రీమతి శ్వేతాప్రసాద్, కె. గాయత్రి లకు ప్రకటించారు. కూచిపూడి నాట్య రంగం నుంచి టి. రెడ్డి లక్ష్మి ఎంపికయ్యారు. 2023వ సంవత్సరపు బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం ఎం. సురేంద్రనాథ్ {కూచిపూడి) ఎంపికయ్యారు. జానపద రంగం నుంచి అంగడి భాస్కర్ (డప్పు)కు ప్రకటించారు. ఈ అవార్డు కింద ఒక్కొక్కరికి 25 వేల రూపాయలు నగదు అందిస్తారు.

– డా. మహ్మద్ రఫీ

# తెనాలిలో త్యాగరాజ ఆరాధన








తెనాలిలో 12.2.2024న త్యాగరాజ ఆరాధన..



ఈ రోజు స్నేహ సంరక్షణ ఆశ్రమం లోనివారికి గుంటూరు గాయత్రీ మహిళాసన్మండలి కార్యవర్గం వారిచే పళ్ళు, ద్రవ్య సమర్పణ.

# శ్రీ శారదా సంగీతాలయం, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా త్యాగరాజ ఉత్సవం

**సంగీత కచేరి - గాత్రం : కుమారి ఎస్.విష్ణుప్రియ, వైలిన్: శ్రీ డి.ఈశ్వరరావు గారు, మృదంగం : బాలాజీ యువరాజ్**

**శ్రీ శారదా సంగీతాలయం, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా విద్యార్థి బృందంచే సాంప్రదాయ కీర్తనల ఆలాపన**














**జనవరి 24 వ తారీకు నెల్లూరు లో జరిగిన "అన్నమయ్య సౌరభాలు" సంగీత కార్యక్రమం.**




**ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ లో త్యాగరాజ ఆరాధన.**

## కుమార్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ - మైసూర్.



కుమార్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్–మైసూర్. వారి 33వ అంతర్జాతీయ నిరంతరాయంగా ఫెస్టివల్ మరియు 3వ శ్రీపురందరదాస, శ్రీ త్యాగరాజ ఆరాధన సంగీత నృత్యమహోత్సవం 24.2.2024న మైసూర్ లో జరిగింది. సర్వశ్రీ అతిధి ప్రసన్నకుమార్–సీనియర్ జర్నలిస్ట్ ముఖ్య అతిధిగా విచ్చేయగా విద్వాన్ వి.నంజుండస్వామి–పురందరదాసుపై ప్రసంగించారు. వేణు విద్వాంసులు–శాస్త్రకోవిదులు డా.సి.ఏ.శ్రీధర్ శ్రీత్యాగరాజ స్వామి జీవితం పై ప్రసంగించారు. డా.సుకన్యప్రభాకర్ (సురభి గానకళామందిర్), శ్రీమతి డా.మాణిక్ ఏ.వి.బెంగెరి (హిందుస్థానీ గాయని) ఇందుపాల్గొన్నారు. స్వరరాగసుధ సంగీత విద్యాలయం సంస్థాపకులు గురువు శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి మరియు వారి శిష్యులు,విద్వాన్ రావు ఆర్.శరత్ శిష్యబృందం పురందర–త్యాగరాజ కృతులు పాడి స్వరార్చన సమర్పించారు. ఈ సందర్భంగా విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గారికి గురుసత్కారం జరిగింది. సంగీత రంగాన వారు చేస్తున్న సేవను కొనియాడారు.

## నాదసుధ-కాకినాడ. ఆధ్వర్యంలో త్యాగరాజ విగ్రహ ప్రతిష్ట, 24వార్షిక సంగీత ఉత్సవాలు




ఫిబ్రవరి 24, 25 తేదీలలో స్థానిక రిజర్వ్ లైన్–రామాలయ ప్రాంగణంలో సభామండపంలో జరిగాయి. మొదటి రోజు శ్రీ మోదుమూడి సుధాకర్ గాత్రసంగీత సభ విశేషంగా అలరించింది. శ్రీ గణేశాత్పరం, దుదుకుగల, సంగీత సామ్రాజ్య, కొలువై యున్నాడే, అప్పరామ భక్తి, మోహన రారారాజీవలోచన, రామరామయనరాద వంటి అంశాలు చోటుచేసుకొని అలరించాయి. ఒక ప్రత్యేకత సంతరించుకొన్న కచేరీ విన్నామన్న అనుభూతిని శ్రోతలకు కలిగించారు. శ్రీ పాలపర్తి నాగేశ్వరరావు వైలన్, శ్రీ కల్యాణరామన్ మృదంగం పై చక్కని సహకారం అందించారు. రెండవ రోజు వాగ్గేయకారులు శ్రీ శ్యామశాస్త్రి సంస్మరణను స్థానిక కళాకారులందరితో కలసి నిర్వహించారు. మొదట విద్వాన్ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు శ్యామశాస్త్రి జీవితం,రచనలపై విశేష ప్రసంగం చేసి ఆకట్టుకున్నారు. ఆనంతరం శ్రీమతులు పెద్దాడ సూర్యకుమారి, చిలుకూరి సుబ్బలక్ష్మి, దేవరకొండ విజయలక్ష్మి, ప్రభల రాజేశ్వరి, మండ విజయకుమారి, టి.పద్మావతి, సరస్వతుల శారద మరియు శిష్యబృందం వారు శ్యామశాస్త్రి రచనలు వినిపించారు. కార్యదర్శి శ్రీమతి విజయకుమారి కార్యక్రమ నిర్వహణ విజయవంతం చేశారు.

# విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్టణం







విశాఖ మ్యూజిక్ అకాడమీ–విశాఖపట్టణం. ఆధ్వర్యంలో ది.21.1.2024 న చెన్నై సంగీత విద్వాంసులు పైలూర్ ఎ.నారాయణన్ గాత్ర సంగీతసభ శ్రవణ శుభగంగా జరిగింది. చక్కని ఉచ్చారణతో సాహిత్య భావాన్ని విశ్లేషిస్తున్నట్టుగా అనిపించింది. జలజాక్ష నీపాదమేగతియని; జయజయ జయజానకీకాంత; వందనమురఘునందన; శేషాచల నాయకం; సీతమ్మమాయమ్మ; ఇంతసౌఖ్యమని చెప్పజాల (ప్రధానాంశం); కనకశైల విహారిణీ; కొన్ని భజనసంప్రదాయ అంశాలు, తిల్లానాతో రసవంతంగా ముగించారు. పప్పుజ్ఞానదేవ్, మండపాక రవి,ఎ.ఎస్.ఆర్ కౌండిన్య(ఘటం) పుష్టినిచ్చే సహకారం అందించి తమను తాము నిరూపించుకొన్నారు. కార్యదర్శి శ్రీ ఎమ్.ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమనిర్వహణ జరిగింది. కచేరీ సమీక్షలో శ్రీ పేరాల బాలమురళీ నిష్పక్షపాతమైన విమర్శను అందించారు. కళాకారులను శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి పరిచయం చేశారు.

విశాఖ మ్యూజిక్ అకాడమీ –విశాఖ. వారి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమంలో 18.2.2024న శ్రీమతి కస్తూరి కమలదీప్తి (విశాఖ–కెనడా) గాత్ర సంగీత సభ ప్రత్యేక తను సంతరించుకొన్నది. సావేరి వర్ణం; హేరంబాయ నమోస్తుతే; పాలయాసుమాం; దర్బారులో ముందువెనుక; తోడిలో సరసిజనాభ మురారే; వాంఛతోను; బేహాగ్ రాగంలో ఖండ త్రిపుట తాళంలో ద్వినడ పల్లవి –పూర్వాంగం చతురస్ర నడకలోను –ఉత్తరాంగం ఖండలోను సాగింది. సాహిత్యం" ఓంకార పంజర సుఖి, ప్రణతోస్మి సారసముఖి సకల లోక నాయకి"; చరణములే నమ్మితి; తిల్లాన సునాద వినోదిని లో అందించగా కార్యక్రమం ముగిసింది. శ్రీ పేరాల వారు చక్కని సమీక్ష చేశారు. కచేరీలో దాశరథి శతక పద్యాన్ని పాడే వారి పట్ల స్వర్గీయ నేదునూరి వారికున్న అభిమానాన్ని కొనసాగిస్తూ కార్యదర్శి శ్రీ ఎమ్.ఎస్. శ్రీనివాస్ ఐదువందలరూపాయల ప్రోత్సాహకాన్ని గాయనికి అందించారు.



సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 177 వ ఆరాధన ఉత్సవాలు సందర్భంగా రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో పంచరత్న సేవ



శ్రీ భద్రాచల రామదాసు 391వ జయంతి ఉత్సవాలు



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం వారి 66వ వార్సికోత్సవంలో 'సంగీత కళామిత్ర' బరుదుతో సత్కరింపబడిన విదుషీ శ్రీమతి వీరగంట లలితా చంద్రశేఖర్



శ్రీజగదంబాత్రిశక్తి పీఠం, బాచుపల్లి-హైదరాబాద్ సంస్థ నుండి ఉత్తమ సంగీతోపాధ్యాయులు అవార్డు అందుకున్న విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి,కాకినాడ నెహ్రూబాలభవన్.

# నివాళి



## కర్ణాటక సంగీత విద్వాంసులు శ్రీమాన్ శేషాచారి మిధనం

హైదరాబాద్ బ్రదర్స్ లో ఒకరైన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు దారూరి శేషాచారి (66) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన క్యాన్సర్తో బాధపడుతున్నారు. 24-02-2024 శనివారం సాయంత్రం ఆరోగ్యం క్షీణించడంతో సికింద్రాబాద్ లోని పద్మారావునగర్ నివాసంలో మృతి చెందారు. ఆయ నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శేషాచారి, రాఘవాచారి ఇద్దరు సోదరులు కర్ణాటక సంగీతంలో విద్వాంసులుగా ఖ్యాతిగాంచి, హైదరాబాద్ బ్రదర్స్ దేశ విదేశాల్లో అనేక కచేరీలు నిర్వహించారు.

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721